మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 7-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 ‖ సంచిక: 8 Issue:8

07 జూలై 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:51 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి సప్తమి మ. 1:20 వరకు తరువాత అష్టమి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం ఉత్తరాభాద్ర సా. 4:09 వరకు తరువాత రేవతి యోగం శోభన మ. 2:24 వరకు కరణం బవ మ. 1:20 వరకు బాలవ రా. 12:54ం వరకు వర్జ్యం తె. 4:12 నుండి తె. 5:46 వరకు దుర్ముహూర్తం ఉ. 8:27 నుండి ఉ. 9:19 వరకు రా. 11:15 నుండి రా. 11:59 వరకు రాహుకాలం మ. 3:36 నుండి సా. 5:13 వరకు యమగండం ఉ. 9:06 నుండి ఉ. 10:43 వరకు గుళికాకాలం మ. 12:21 నుండి మ. 1:58 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:15 నుండి తె. 5:03 వరకు అమృత ఘడియలు ఉ. 11:31 నుండి మ. 1:08 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:55 నుండి మ. 12:47 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial



## ఉన్నత విద్యపై సీఎం సమీక్ష

సచివాలయంలో సమావేశం

పథకాల పురోగతిపై చర్చ

విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి

**చెన్నై, జులై 6**

తమిళనాడు ముఖ్యమంత్రి ఎస్. జోసెఫ్ విజయ్ సోమవారం రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ కార్యకలాపాలు, సంక్షేమ పథకాల అమలుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిం చారు. చెన్నైలోని రాష్ట్ర ప్రధాన సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఉన్నత విద్యాశాఖ (మిగతా 2వ పేజీలో)



# టూరిజం హబ్‌గా... ఫ్యూచర్ సిటీ

అంతర్జాతీయ స్థాయిలో ఎకో పార్కులు

క్యూర్ పరిధిలోని అటవీ శాఖ భూముల అభివృద్ధి

పురానాపూల్ వంతెనలపై పర్యాటక ఏర్పాట్లు

వికారాబాద్ ఆలయానికి ప్రత్యేక కమిటీ

డిసెంబర్‌లో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్

పర్యాటకాభివృద్ధిపై సీఎం రేవంత్ దిశానిర్దేశం

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీర్చిదిద్దేందుకు తలపెట్టిన ప్రాజెక్టుల పనులను తక్షణమే వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో పర్యాటక శాఖపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

హైదరాబాద్, జూలై 06: భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలోని అటవీ భూముల్లో అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియా పరిధిలో ఉన్న అటవీ శాఖ భూములను తరువాయి 2 వ పేజీలో..





## శ్యామా ప్రసాద్‌కు రాజ్‌నాథ్ నివాళి

125వ జయంతి సందర్భంగా స్మరణ

సేవలను కొనియాడిన రక్షణ మంత్రి

ఆదర్శాలు స్ఫూర్తిదాయకమన్న వ్యాఖ్య

## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,701 |
| వెండి (కిలో): | రూ.2,60,100 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,896 |



## క్యాన్సర్ ఔషధ తయారీ కేంద్రం ప్రారంభం

సిరో ఫార్మా యూనిట్ ప్రారంభం

ఫార్మా రంగానికి ప్రోత్సాహం

చౌకగా మందులు అందించాలి



**సిద్దిపేట, జులై 6**

సిద్దిపేట జిల్లా మార్కుక్ మండలంలోని బయోటెక్ పార్క్ ఫేజ్-3లో సిరో ఫార్మా ఆధ్వర్యంలో నిర్మించిన అత్యాధునిక ఆంకాలజీ (క్యాన్సర్) ఔషధాల తయారీ కేంద్రాన్ని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల (మిగతా 2వ పేజీలో)



## అమర్‌నాథ్ యాత్రకు కట్టుదిట్ట భద్రత

సంయుక్తంగా భద్రతా ఏర్పాట్లు

యాత్రికులకు నిరంతర సేవలు

అప్రమత్తంగా భద్రతా బలగాలు

**శ్రీనగర్, జులై 6**

అమర్‌నాథ్ యాత్ర--2026ను సురక్షితంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ), జమ్మూ కశ్మీర్ పోలీసులు, భారత సైన్యం, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు సంయుక్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాయి. యాత్రికుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ అన్ని మార్గాల్లో నిరంతర నిఘా కొనసాగిస్తున్నాయి. యాత్రా మార్గాల్లో భద్రతా (మిగతా 2వ పేజీలో)

## కశ్మీర్‌ను వణికించిన భారీ వర్షాలు

కొండచరియలు విరిగి భారీ నష్టం

జలవిద్యుత్ ప్రాజెక్టులో చిక్కుకున్న వాహనాలు


సహాయక చర్యల్లో ఎన్డీఆర్ఎఫ్, సైన్యం

**శ్రీనగర్, జులై 6**

జమ్మూకశ్మీర్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు సోమవారం తీవ్ర బీభత్సం సృష్టించాయి. పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడగా, కిశ్త్‌వాడ్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న 540 మెగావాట్ల జలవిద్యుత్ ప్రాజెక్టు ప్రాంతం తీవ్రంగా దెబ్బతింది. ప్రాజెక్టు ప్రాంతానికి వెళ్లే రహదారిపై భారీగా బురద, బండరాళ్లు పేరుకుపోవ డంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కొండచరియలు విరి గిపడటంతో (మిగతా 2వ పేజీలో)



## విశ్వవాణి



2019లో అమెరికాలోని నార్త్ కరోలినాకు చెందిన ఆరోన్ స్మిత్ సింగ్యులారిటీ అనే వినూత్నమైన, వ్యంగ్యాత్మక డేటింగ్ యాప్‌ను రూపొందించాడు. ఈ యాప్‌లో పురుషులుగా ఎవరూ ఉండరు - అతనొక్కడే ఉంటాడు. యాప్‌లో చేరిన మహిళలు ఎంతసేపు స్వైప్ చేసినా, వారికి కనిపించేది వివిధ ఫోటోలు, భిన్నమైన ప్రొఫైల్ వివరాలతో ఉన్న ఆరోన్ స్మిత్ మాత్రమే. అంటే యాప్‌లో ఉన్న ఏకైక వరుడు అతడే. ఈ యాప్‌ను తాను సరదాగా క్రియేట్ చేశానని చెప్పుకొచ్చాడీ ప్రబుద్ధుడు.

## హమాలీల సమస్యలు పరిష్కరించడం మా బాధ్యత

రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా

రైతులకు నీరు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శ

**హైదరాబాద్, జులై 6** హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లోని మల్లాపూర్‌లో జరిగిన 18వ హమాలీ యూనియన్ (మిగతా 2వ పేజీలో)



## హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో తనిఖీలు



హైడ్రా బృందం పరిశీలన

అనుమతులపై విచారణ

తదుపరి చర్యలకు సన్నాహం

**హైదరాబాద్, జులై 6**

హుస్సేన్‌సాగర్ పూర్తి ట్యాంకు మట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలో నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా, జీహెచ్ఎంసీ, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా సోమవారం క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిం చింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, హైదరా బాద్ కలెక్టర్ డా. ప్రియాంక అలా నేతృత్వంలో అధికారుల బృందం నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించింది. ఇరిగేషన్ శాఖ నుంచి అందిన ఫిర్యాదు మేరకు అధికారులు నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టారు. హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టేందుకు తమ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు మంజూరు చేయలేదని ఇరిగేషన్ అధికారులు (మిగతా 2వ పేజీలో)

## రాశి ఫలాలు

7.6.2026

**మేషం :** మీ ప్రయత్నాలకు అనుకూల ఫలితాలు లభిస్తాయి. మిత్రుల సహకారంతో విజయం సాధిస్తారు. ఆనందకరమైన సమయం మీ సొంతం అవుతుంది. దత్తాత్రేయ స్వామి ఆరాధన మేలు చేస్తుంది.

**వృషభం :** పదవీ, గౌరవ యోగాలు అనుకూలిస్తాయి. కొత్త వస్తువులు కొనుగోలు చేస్తారు. వ్యాపారంలో మంచి నిర్ణయాలు ఫలిస్తాయి. ప్రయాణాలు లాభదాయ కంగా ఉంటాయి. ఇష్టదైవ దర్శనం శుభప్రదం.

**మిథునం :** వృత్తి, ఉద్యోగాల్లో శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. అభివృద్ధిపై దృష్టి పెడితే మేలు జరుగుతుంది. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ అవసరం. ఇష్టదేవతా ఆరాధన మేలు చేస్తుంది.

**కర్కాటకం :** స్వల్ప ఆటంకాలు ఎదురైనప్పటికీ ధైర్యంగా ముందుకు సాగితే విజయం సాధిస్తారు. దీర్ఘకాల సమస్యకు పరిష్కారం లభిస్తుంది. సూర్యాష్టక పఠనం శుభప్రదం.

**సింహం :** మిశ్రమ ఫలితాలు ఉంటాయి. పట్టుదలతో పనులు పూర్తి చేస్తారు. తోటివారి సహకారం లభిస్తుంది. సేవా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంది. ఇష్టదైవ ఆరాధన మేలు చేస్తుంది.

**కన్య :** లక్ష్యాలు నెరవేరుతాయి. తోటివారితో సంతోషాన్ని పంచుకుంటారు. సమాజంలో కీర్తి ప్రతిష్ఠలు సంపాదిస్తారు. ధన, వస్త్ర లాభాలు కలుగుతాయి. సూర్య నమస్కారం వల్ల మంచి జరుగుతుంది.

**తుల :** పట్టుదలతో కార్యసిద్ధి సాధిస్తారు. అధికారుల ఆదరణ లభిస్తుంది. తోటివారి సహకారంతో విజయాలు అందుకుంటారు. శ్రీరామ నామస్మరణ మంగళకరం.

**వృశ్చికం :** గత విషయాలపై జాగ్రత్త అవసరం. సంయమనంతో వ్యవహరిస్తే సమస్యలు తగ్గుతాయి. కలహాలకు దూరంగా ఉండండి. గోసేవ శుభఫలితాలను ఇస్తుంది.

**ధనుస్సు :** తోటివారి, కుటుంబ సభ్యుల సహకారంతో పనులు పూర్తవుతాయి. ఆర్థికంగా అనుకూలత ఉంటుంది. శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం శుభప్రదం.

**మకరం :** ఇష్టకార్యసిద్ధి కలుగుతుంది. ఉద్యోగ, వ్యాపారాల్లో అనుకున్న ఫలితాలు సాధిస్తారు. అధికారుల సహకారం లభిస్తుంది. శివారాధన మేలు చేస్తుంది.

**కుంభం :** ఉద్యోగ, వ్యాపారాల్లో మిశ్రమ ఫలితాలు కనిపిస్తాయి. ఒత్తిడిని అధిగమించి విజయం సాధిస్తారు. సమాజంలో మీ పట్ల గౌరవం పెరుగుతుంది. శివారాధన శక్తిని ఇస్తుంది.

**మీనం :** కొన్ని ఆటంకాలు ఎదురైనప్పటికీ ఉత్సాహంతో ముందుకు సాగితే అనుకూల ఫలితాలు పొందుతారు. అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. శ్రీరామ దర్శనం శుభప్రదం.



# టూరిజం హబ్‌గా ఫ్యూచర్ సిటీ

మొదటి పేజీ తరువాయి

పర్యాటక శాఖతో కలిసి ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అలాగే గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో నగరంలో మరిన్ని ఎకో పార్కులను అందుబాటులోకి తేవాలని సూచించారు. అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టుల పనులను ముమ్మరం చేసేందుకు వెంటనే స్పెషల్ ఆఫీసర్లను నియమించుకోవాలని ఆదేశించారు.

### ఆకర్షణీయంగా దుర్గం చెరువు

నగరంలోని పర్యాటక ప్రాంతాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సూచించారు. తారామతి బారాదరితో పాటు దుర్గం చెరువును పూర్తిస్థాయి పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలన్నారు. అలాగే మంజీరా, దిల్‌కుషా అతిథి గృహాలను వెంటనే ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అద్భుతంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ప్రధానంగా వికారాబాద్‌లోని వీరభద్రస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు, యాదగిరిగుట్ట తరహాలో ఆ దేవస్థానానికి ప్రత్యేక పాలక మండలిని ఏర్పాటు చేయాలని సీఎం స్పష్టం చేశారు.

### వారసత్వ వంతెనలపై పర్యాటకం

చారిత్రక వారసత్వ సంపదగా నిలిచిన పురానాపూల్ లాంటి హెరిటేజ్ వంతెనలను అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. అందుకోసం అవసరమైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు. అభివృద్ధి చేసిన తర్వాత బ్రిడ్జిలపై పర్యాటకుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, అవసరమైతే ఆయా మార్గాల్లో ట్రాఫిక్ మరో మార్గం నుంచి మళ్లించి పర్యాటకులకు అవకాశం కల్పించాలని సూచించారు.

### సమ్మిట్ కోసం కమిటీలు వేయండి

రాష్ట్రంలో పర్యాటక రంగంలో పెట్టుబడులకు సంబంధించి అధికారులను సీఎం ఆరా తీశారు. వచ్చే డిసెంబర్‌లో నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ పై వెంటనే కసరత్తు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సదస్సు విజయవంతం కోసం వివిధ శాఖల మధ్య సమన్వయానికి ఉన్నతస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, టూరిజం సెక్రటరీ వాణి ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ ఎండీ గౌతమి తదితర అధికారులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ ఔషధ తయారీ కేంద్రం ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

శ్రీధర్‌బాబుతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫార్మా రంగంలో తెలంగాణ మరింత ముందంజలో నిలుస్తుందని మంత్రి పొంగులేటి అన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఫార్మా రంగంలో హైదరాబాద్‌కు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. ఆ గుర్తింపును మరింత బలోపేతం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు అన్ని విధాలుగా సహకరిస్తోందన్నారు. పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పించడం ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని తెలిపారు. తెలంగాణలోనే క్యాన్సర్ వ్యాధిపై పరిశోధనలు చేపట్టి ఔషధాల తయారీ ప్రారంభించడం గర్వకారణమని మంత్రి అన్నారు. ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించే ప్రత్యేక ఫార్మా పరిశోధనలకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందిస్తుందని స్పష్టం చేశారు. ఈ రంగంలో కొత్త ఆవిష్కరణలకు తెలంగాణ కేంద్రంగా మారాలని ఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ వ్యాధి తీవ్రమైన సవాల్‌గా మారిందని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల తేడా లేకుండా అనేక మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారని, ఖరీదైన మందులు కొనుగోలు చేయలేక బాధపడుతున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో క్యాన్సర్ నివారణకు కొత్త ఔషధాల అభివృద్ధి ఎంతో అవసరమన్నారు. సిరో ఫార్మా సంస్థ తయారు చేసే క్యాన్సర్ నిరోధక ఔషధాలను ప్రజలకు అందుబాటు ధరల్లో అందించాలని యాజమాన్యాన్ని మంత్రి కోరారు. నాణ్యమైన వైద్య సేవలు అందరికీ చేరువ కావాలంటే చౌక ధరల్లో మందులు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పరిశ్రమలు సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని అన్నారు. భవిష్యత్తులో ఫార్మా రంగంలో సిరో ఫార్మా మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని మంత్రి ఆకాంక్షించారు. సంస్థ యాజమాన్యానికి, శాస్త్రవేత్తలకు, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, తెలంగాణను ప్రపంచ స్థాయి జీవ విజ్ఞాన, ఔషధ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పునరుద్ఘాటించారు.

# ఉన్నత విద్యపై సీఎం సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

పనితీరు, ప్రస్తుత పథకాల అమలు, భవిష్యత్ కార్యాచరణపై అధికారు లతో విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ఉన్నత విద్యా రంగంలో అమలవుతున్న వివిధ పథకాల పురోగతిని ముఖ్యమంత్రి సమీక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందించేందుకు చేపడుతున్న కార్యక్రమాలపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని సూచించినట్లు సమాచారం. ఉన్నత విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యా ప్రమాణాల మెరుగుదల, విద్యార్థి సంక్షేమ కార్యక్రమాల అమలుపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. విద్యార్థులకు మరింత మెరు గైన అవకాశాలు కల్పించే దిశగా శాఖ మరిం త సమర్థవంతంగా పనిచేయాలని ముఖ్య మంత్రి సూచించారు. విద్యా రంగంలో సాంకే తికత వినియోగం, నైపుణ్యాభివృద్ధి కార్యక్ర మాలు, పరిశోధ నలకు ప్రాధాన్యం కల్పిం చాల్సిన అవసరాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావి ంచినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర అభి వృద్ధిలో ఉన్నత విద్య కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి విద్యార్థికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి ఆదేశిం చారు. విద్యా రంగంలో నాణ్యత పెంపుతో పాటు పరిపాలనా వ్యవస్థను మరింత బలోపే తం చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావే శంలో ఉన్నత విద్యాశాఖకు చెందిన ఉన్నతాధికారులు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు. విద్యా రంగ అభివృద్ధికి అవసరమైన చర్యలను వేగవంతం చేస్తూ రాష్ట్రంలో ఉన్నత విద్యను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

# హమాలీల సమస్యలు పరిష్కరించడం మా బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన హమాలీ కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, హమాలీ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హమాలీల కూలీ రేట్లను గణనీయంగా పెంచినట్లు గుర్తు చేశారు. గతంలో బస్తాకు రూ.8 మాత్రమే ఉండే రేటును రూ.26కు పెంచామని, ఐదేళ్లకోసారి కాకుండా రెండేళ్లకోసారి కూలీ రేట్ల సవరణ చేపట్టి హమాలీలకు న్యాయం చేశామని అన్నారు. హమాలీలకు ఆరోగ్య భద్రతతో పాటు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం తమ ప్రభుత్వ ప్రత్యేకత అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని కేటీఆర్ ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద లక్ష క్యూసెక్కుల గోదావరి నీరు వృథాగా సముద్రంలో కలుస్తున్నా ప్రభుత్వం పంపులను ప్రారంభించడం లేదని విమర్శించారు. రెండు పంపులు ప్రారంభిస్తే రాష్ట్రవ్యాప్తంగా రైతులకు సాగునీరు అందుతుందని తాము పదేపదే కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు.

# కశ్మీర్‌ను వణికించిన భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

ట్రక్కులు, మిల్లులు, ఇతర భారీ యంత్రాలు బురదలో కూరుకుపోయాయి. మరికొన్ని వాహనాలు భారీ రాళ్ల కింద చిక్కుకుపోయాయి. నిర్మాణానికి సంబంధించిన పరికరాలు, సామగ్రి కూడా దెబ్బతిన్నట్లు అధికారులు వెల్లడించారు. సమాచారం అందుకున్న వెంటనే ఎన్డీఆర్ ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, భారత సైన్యం, స్థానిక రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి. శిథిలాల కింద చిక్కుకున్న వాహనాలను వెలికితీసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు కొనసాగు తున్నాయి. ఆకస్మిక వరదలతో భారీ మొత్తంలో బురద, బండరాళ్లు ప్రాజెక్టు ప్రాంతంలోకి చేరాయని అధికారులు తెలిపారు. దీంతో నిర్మాణ పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని, నష్టం అంచనా వేసే పనులు కొనసాగు తున్నాయని వెల్లడించారు. ఆస్తి, ప్రాణనష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. ప్రజల భద్రత దృష్ట్యా కంట్రోల్ రూమ్, హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రమాద ప్రభావిత ప్రాంతాలకు ప్రజలు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు. భారీ వర్షాల కారణంగా ప్రధాన రహదా రులపై కూడా బురద, శిథిలాలు పేరుకు పోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాతావరణ పరిస్థితులు మెరుగు పడే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో అధికారుల సూచనలు పాటించాలని యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.

# హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో తనిఖీలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా స్పష్టం చేసినట్లు తెలిపారు. ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ చేపడుతున్న భవన నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, నిబంధనల అమలు, సంబంధిత పత్రాలను అధికారులు పరిశీలించారు. నిర్మాణ పనులు ఎలాంటి అనుమతుల ఆధారంగా కొనసాగుతున్నాయనే అంశంపై అన్ని కోణాల్లో వివరాలు సేకరించారు. అధికారుల బృం దం నిర్మాణ ప్రాంతాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి, సంబం ధిత శాఖల నుంచి పూర్తి సమాచారం కోరింది. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలకు సంబంధించి అమల్లో ఉన్న నిబం ధనలు ఉల్లంఘించబడ్డాయా లేదా అనే అంశంపై సమగ్ర విచారణ కొనసాగుతున్నట్లు వెల్లడించింది. పూర్తి స్థాయి విచారణ అనంతరం సంబంధిత రికార్డులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అవసరమైతే చట్టపరమైన చర్యలు కూడా చేపడతామని స్పష్టం చేశారు. జలవనరులు, చెరువుల పరిరక్షణ విష యంలో ఎలాంటి రాజీ ఉండదని అధికా రులు పేర్కొ న్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టే నిర్మాణాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ప్రజా ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ చట్టం ప్రకారం వ్యవహరిస్తామని తెలిపారు.

# అమర్‌నాథ్ యాత్రకు కట్టుదిట్ట భద్రత

(మొదటి పేజీ తరువాయి)

సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ ప్రతి యాత్రికుడికి అవసరమైన సహాయాన్ని అందిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక భద్రతా చర్యలు అమలు చేస్తున్నారు. యాత్రికులకు మార్గదర్శనం చేయడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా భద్రతా బలగాలు సిద్ధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. యాత్ర నిరంతరా యంగా కొనసాగేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచే స్తున్నాయి. సేవ, భద్రత, సౌభ్రాతృత్వం లక్ష్యంగా ఎస్ఎస్‌బీ సిబ్బ ంది యాత్రికులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ మానవతా దృక్పథంతో విధులు నిర్వర్తిస్తున్నారు. భద్రతతో పాటు యాత్రికుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. యాత్ర మార్గాల్లో నిరంతర గస్తీ, తనిఖీలు, నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసినట్లు అధికారులు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర భద్రతా బలగాల సమన్వయంతో యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు కొనసాగుతు న్నాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి తరలివస్తున్న భక్తులు ప్రశాంతంగా అమర్‌నాథ్ దర్శనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

## కన్నెపల్లి పంపు ప్రారంభించాలి

హైదరాబాద్,జూలై6: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన చర్యల వల్లే రాష్ట్రంలో వరి భారీగా పండుతోందని ఆ పార్టీనేత, మాజీ ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. మేడిగడ్డ అనేది కాళేశ్వరం ప్రాజెక్టులో చిన్న అంశమని చెప్పారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. 2014కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంది కదా.. ఎందుకు భారీగా పండలేదు కన్నెపల్లి పంపుహౌస్‌ను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎల్లంపల్లి, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టుల్లో నీరు నింపాలి. పూర్తిగా నింపకపోయినా.. పాక్షికంగానైనా నింపాలి. ఇసుక మాఫియాను కట్టడి చేయాలని డిమాండ్ చేశారు.

## ఎసిబికి చిక్కిన చేర్యాల తహసిల్దార్

సిద్దిపేట,జూలై6: సిద్దిపేట జిల్లా చేర్యాల తహసీల్దార్ దిలీప్ నాయక్ ఏసీబీకి చిక్కారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు నాలా కన్వర్షన్ కోసం ఓ రైతు వద్ద తహసీల్దార్ లంచం డిమాండ్ చేశారు. ఈ క్రమంలో రూ.70వేలు తీసుకుంటూ ఆయన పట్టుబడ్డారు. దిలీప్ నాయక్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

## గంజాయి సాగుచేసే వారిపట్ల కఠన చర్యలు

**తీవ్రవాదులుగా గుర్తించ చర్యలు తీసుకుంటాం**

**తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరిక**

భద్రాద్రి కొత్తగూడెం,జూలై6: రాష్ట్రంలో గంజాయి రవాణాను అరికట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఇప్పటికే దాడులు చేపట్టి పెద్ద ఎత్తున అరికట్టే చర్యలు చేపట్టామని అన్నారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరులో నూతన పోలీస్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ప్రతి పోలీస్ అధికారి డ్రగ్స్‌పై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. గంజాయి సాగును చేసే వారిని తీవ్రవాదుల కంటే ఎక్కువగా పరిగణిస్తామని హెచ్చరించారు. ప్రజలకు మంచి సేవలు అందించాలని ఈ సందర్భంగా పోలీసులకు ఆయన సూచించారు. ప్రజలకు ఆటంకం కలగకుండా శాంతి భద్రతలు కాపాడాలని పోలీసులకు తెలంగాణ డీజీపీ స్పష్టం చేశారు. ఏఐ టెక్నాలజీతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పోలీసులకు వివరించారు. యువత డ్రగ్స్‌కి అలవాటు కాకుండా ఉండేందుకు కఠినమైన చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మావోయిస్టులను పూర్తిగా అదుపు చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం కొత్తగా మాదక ద్రవ్యాలు, సైబర్ క్రైమ్స్, రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించాలని పోలీసులకు స్పష్టం చేశారు.

## పాత ఫర్నీచర్ సేకరణకు జిహెచ్ఎంసి నిర్ణయం

**కాల్వలు, రోడ్లపై పడేయకుండా చర్యలు**

హైదరాబాద్,జూలై6:భాగ్యనగర వాసులకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అదిరిపోయే శుభవార్త చెప్పింది. ఇంట్లో పనికిరాని పాత పరుపులు, సోఫాలు, కుర్చీలు, టేబుళ్లు వంటి భారీ వ్యర్థాలను ఇకపై రోడ్లపై, మురుగు కాలువల్లో పడేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. పాత పరుపులు, ఫర్నిచర్‌ను ఇళ్ల వద్ద నుంచే ఉచితంగా సేకరించే ప్రత్యేక సేవను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించింది. ఈ మేరకు జీహెచ్ఎంసీ తన అధికారిక 'ఎక్స్' ఖాతా వేదికగా ప్రజలకు అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా భారీ వ్యర్థాలను వీధులు, ఖాళీ స్థలాలు, మురుగు కాలువల్లో పడేయకుండా నూతన సేవను వినియోగించుకోవాలని జీహెచ్ఎంసీ విజ్ఞప్తి చేసింది. ఈ మార్పు హైదరాబాద్ పరిశుభ్రత మెరుగుపడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకూ దోహదం చేస్తుందని పేర్కొంది. ఇంటి వద్దకే వచ్చి పాత పరుపులు, ఫర్నిచర్‌ను ఉచితంగా సేకరించి, సురక్షితమైన, శాస్త్రీయ విధానంలో రీసైక్లింగ్ చేస్తామని జీహెచ్ఎంసీ తెలిపింది. ఇందుకోసం క్యూఆర్ (ఖీఖీ) కోడ్‌ను స్కాన్ చేసి డోర్‌స్టెప్ పికప్‌ను ముందస్తుగా బుక్ చేసుకోవచ్చని సూచించింది. ప్రస్తుతం ఈ సేవ తమ పరిధిలోని ఆరు జోన్లలో అందుబాటులో ఉందని జీహెచ్ఎంసీ తెలిపింది. సికింద్రాబాద్, ఖైరతాబాద్, గోల్కొండ, చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్ల ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని వెల్లడించింది. సేవా పరిధిని కవరేజ్ మ్యాప్ ద్వారా తెలుసుకుని, స్కాన్ చేసి ఉచిత పికప్‌ను బుక్ చేసుకోవాలని సూచించింది. భారీ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా జీహెచ్ఎంసీకి అప్పగించడం ద్వారా పరిశుభ్రమైన హైదరాబాద్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చింది.

## ఆదాయానికి మించిన ఆస్తుల కేసు

**డిఎస్పీ భీమ్‌రెడ్డిని అరెస్ట్ చేసిన ఎసిబి**

హైదరాబాద్,జూలై6: ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలతో నమోదైన కేసులో డీఎస్పీ భీమ్‌రెడ్డిని ఏసీబీ అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. ఇటీవల నిర్వహించిన సోదాల్లో భారీ మొత్తంలో ఆస్తులు బయటపడటంతో ఆయనపై ఏసీబీ అధికారులు చర్యలు వేగవంతం చేశారు. ఐదు రోజుల క్రితం ఏసీబీ అధికారులు భీమ్‌రెడ్డితో పాటు ఆయన బంధువులకు సంబంధించిన నివాసాలు, ఇతర ప్రాంతాల్లో విస్తృత సోదాలు నిర్వహించాచిన విషయం తెలిసిందే. తెలంగాణలోని మొత్తం 16 ప్రాంతాల్లో ఏకకాలంలో చేపట్టిన ఈ దాడుల్లో పలు విలువైన ఆస్తులు, పత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోదాల సందర్భంగా సుమారు రెండు కిలోల బంగారం, 20 కిలోల వెండి, 23 విదేశీ మద్యం సీసాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే స్థిర, చరాస్తులకు సంబంధించిన పలు కీలక పత్రాలను కూడా పరిశీలించినట్లు సమాచారం. సోదాల అనంతరం భీమ్‌రెడ్డి అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిన తర్వాత ఏసీబీ అధికారులు అధికారికంగా అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. కేసులో స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ, వాటి మూలాలు, కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న ఆస్తుల వివరాలపై ఏసీబీ అధికారులు సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను ఏసీబీ అధికారులు త్వరలో వెల్లడించే అవకాశం ఉంది.

## ఎపిలో విలేజ్ మార్ట్‌ల ఏర్పాటు

గుంటూరు,జూలై6: గ్రామాల్లో విలేజ్ మార్ట్‌లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రేషన్ షాపుల ద్వారా తక్కువ ధరకే నిత్యావసరాల అమ్మకాలు జరగనున్నాయి. ప్రత్తిపాడు నియోజకవర్గం లాల్‌పురంలో పైలట్ ప్రాజెక్ట్‌ను ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ భాష్యం రామకృష్ణ, ఎమ్మెల్యే రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మీడియాతో మాట్లాడారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రస్తుతం ఒక్కరోజే 7 విలేజ్ మార్ట్‌లు ప్రారంభించామని తెలిపారు. జగన్ హయాంలో రాష్ట్రంలోని 29,750 రేషన్ షాపులను పూర్తిగా నిర్వీర్యం చేశారని మంత్రి నాదెండ్ల మండిపడ్డారు.

# గిరిజన ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్లు

**పబ్లిక్ గ్రీవెన్స్ సమస్యలు తక్షణం పరిష్కరించాలి.. అధికారులను ఆదేశించిన సిఎం చంద్రబాబు**




అమరావతి,జూలై6: గిరిజన ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. గిరిజనులకు నాణ్యమైన భోజనం అందించాలన్నదే లక్ష్యమని అన్నారు. పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని వ్యాఖ్యానించారు. పట్టణ ప్రాంత స్థానిక సంస్థల్లో జీరో వేస్ట్ లక్ష్యమని పేర్కొన్నారు. సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్ నుంచి వివిధ అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు అంశాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.పురపాలక, పంచాయతీరాజ్, హోం, ఎక్సైజ్ తదితర శాఖల ద్వారా అందిస్తున్న ప్రభుత్వ సేవలపై ఈ సమావేశంలో సీఎం చర్చించారు. విశాఖపట్నం సముద్రం తీరంలో బోటు మునిగి మత్స్యకారులు గల్లంతైన ఘటనలో తక్షణ స్పందనగా ఏయే విభాగాలు ఎలా స్పందించాయన్నదే కీలకమని అన్నారు. ఏపీ అభివృద్ధిలో ప్రజాపాలనలో పొలిటికల్ మేనేజ్‌మెంట్ – బ్యూరోక్రటిక్ యాక్షన్ సమపాళ్లలో ఉండాలని దిశానిర్దేశం చేశారు. పబ్లిక్ గ్రీవెన్స్ సిస్టమ్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మూడు నెలల్లో యూఎల్‌బీల్లో చెత్త తొలగింపు పనులు చేపట్టాలని సీఎం చంద్రబాబు మార్గనిర్దేశర చేశారు. గంజాయి నిర్మూలనపై తీసుకుంటున్న చర్యలపై సమాచారం ప్రజల్లోకి వెళ్లేలా చూడాలని నిర్దేశిరచారు. క్షేత్రస్థాయిలో తాగునీరు, వ్యర్థాల సేకరణకు స్వచ్ఛ రథాలు, ఇంటింటికీ చెత్త సేకరణ లాంటి అంశాల్లో స్పష్టమైన ఎస్ఓపీ జారీ చేయాలని ఆదేశించారు. నెలరోజుల్లోగా అన్ని ప్రభుత్వ శాఖలూ అవేర్ 2.0 ద్వారా ఏ మేరకు ఫలితాలు వచ్చాయో విశ్లేషించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనికేషన్ నెట్‌వర్క్ కనెక్టివిటీ కోసం మారుమూల ప్రాంతాల్లోని టవర్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

# దలైలామా దీర్ఘాయుష్మతో జీవించాలి

**ఎక్స్‌లో చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు**



అమరావతి,జూలై6: టిబెట్‌కు చెందిన బౌద్ధ మత గురువు దలైలామా పుట్టిన రోజు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. దలైలామాకు సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం పోస్ట్ చేశారు. ప్రపంచ శాంతి, మానవ హక్కుల కోసం దలైలామా కృషి ప్రశంసనీయమని కొనియాడారు. 'శాంతి, కరుణ, మానవత్వానికి దలైలామా ప్రతీక. దశాబ్దాలుగా ప్రపంచాన్ని ప్రేరేపిస్తున్న మహోన్నతుడు దలైలామా. దయ, జ్ఞానం, అహింసను ఆచరించాలని దలైలామా సందేశం ఇచ్చారు. ప్రపంచ శాంతి, మానవ హక్కుల కోసం దలైలామా కృషి ప్రశంసనీయం. దలైలామాకు సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం, దీర్ఘాయుష్షు కలగాలి. శాంతి, కరుణ వ్యాప్తి చేసే దలైలామా సేవలు చిరస్మరణీయం. దలైలామా తన మహోన్నత సేవలను మరింత కాలం కొనసాగించాలి' అని ఆకాంక్షిస్తూ ఎక్స్‌లో సీఎం చంద్రబాబు పోస్ట్ చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల పోరాట యోధుడు బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు నివాళు లర్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'సామాజిక న్యాయ సాధనకు, బడుగు బలహీన వర్గాల సాధికారతకు, సమాన అవకాశాలు కలిగిన సమసమాజ నిర్మాణానికి జీవితాంతం అంకితభావంతో కృషి చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్. దేశ వ్యవసాయ రంగంలో హరిత విప్లవానికి బలమైన పునాది వేసి, ఆహార భద్రత సాధనలో విశిష్ట పాత్ర పోషించిన దూరదృష్టి గల నాయకుడు. ఆయన వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్ఫూర్తిదాయక సేవలను స్మరించుకుంటూ ఘన నివాళు లర్పిస్తున్నాను' అని సీఎం చంద్రబాబు తెలిపారు.

# దక్షిణ కొరియా పర్యటలనో లోకేశ

**పెట్టుబడుల కోసం పలువురితో వరుస భేటీలు**

అమరావతి,జూలై6: దక్షిణ కొరియా పర్యటనలో ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ బిజీబిజీగా ఉన్నారు. ఏపీలో పెట్టుబడులే లక్ష్యంగా ప్రముఖ పారిశ్రామికవేత్తలతో వరుసగా భేటీ అయి చర్చలు జరుపుతున్నారు. ఇందులో భాగంగా షూఆల్స్ ఛైర్మన్ లీ చియాంగ్–గెన్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. ఏపీలో షూఆల్స్ పాదరక్షల యూనిట్ పనులు వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీలో ఆర్ అండ్ డీ, ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని షూఆల్స్‌కు మంత్రి ఆహ్వానం పలికారు. ఏపీని రిటైల్, డిస్ట్రిబ్యూషన్ హబ్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. మంత్రి లోకేశ్ విజ్ఞప్తిపై షూఆల్స్ ఛైర్మన్ సానుకూలంగా స్పందిస్తూ.. ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామన్నారు. ఏపీలో రూ.300 కోట్లతో షూఆల్స్ యూనిట్ ఏర్పాటు కానుంది. దీని ద్వారా 3 వేల మందికి ఉపాధి లభించనుంది. సోలమ్ గ్రూప్ గ్లోబల్ ఆపరేషన్స్ ఆఫీసర్ జీగాబ్ హాతో మంత్రి భేటీ అయ్యారు. శ్రీసిటీలో సోలమ్ యూనిట్ నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. శ్రీసిటీలో ఎలక్ట్రానిక్ షెల్ఫ్ లేబుల్స్ తయారీ విస్తరణకు మంత్రి ఆహ్వానించారు. శ్రీసిటీ పనులు వేగవంతం చేస్తామని సోలమ్ సంస్థ పేర్కొంది. రూ.338 కోట్లతో శ్రీసిటీలో సోలమ్ ఈవీ ఛార్జర్ యూనిట్ నిర్మాణం జరగనుంది. ఆపై సాఫ్ట్–ఈపీఐ సీఈవో సుంగ్ మిన్ హ్వాంగ్, సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ ఇన్–సుంగ్ చోతో మంత్రి సమావేశమయ్యారు. ఏపీలో మైక్రో ఎల్ఈడీ డిస్‌ప్లే మెటీరియల్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. తిరుపతి ఐఐటీ సహకారంతో అడ్వాన్స్‌డ్ ఎపిటాక్సీ సెంటర్‌కు ఆహ్వానం పలికారు. ఏటా 500 మంది టెక్నీషియన్లకు శిక్షణ ఇచ్చే అకాడమీ ఏర్పాటుకు ప్రతిపాదన చేశారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని ఈ సందర్భంగా సాఫ్ట్–ఈపీఐ సీఈవో తెలిపారు. కొరియా పర్యటనలో పెట్టుబడుల ఆకర్షణపైనా మంత్రి లోకేశ్ దృష్టి సారించారు.

## మత్స్యకారుల గల్లంతుపై డిప్యూటి సిఎం ఆందోళన

**గాలింపు చర్యలు ముమ్మరుం చేయాలిన పవన్ ఆదేశం**

అమరావతి,జూలై6: విశాఖ హార్బర్ నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లిన ఏడుగురు మత్స్యకారులు గల్లంతైన ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. సముద్రంలో మత్స్యకారుల గల్లంతుపై ఆరా తీశారు. విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మెరైన్ పోలీసులు, కోస్టు గార్డు, నేవీ సహకారం తీసుకోవాలని సూచించారు. గల్లంతైన మత్స్యకారులను రక్షించేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని.. ఆందోళన చెందవద్దని వారి కుటుంబ సభ్యులకు పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. భోగాపురం మత్స్యకారులు గల్లంతుపై విజయనగరం, విశాఖ కలెక్టర్లు రామ్ సుందర్‌రెడ్డి, అభిషిక్త్ కిషోర్‌తో మంత్రి కొండపల్లి, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మత్స్యకారులను రక్షించేందుకు చేపట్టిన చర్యలను మంత్రికి వివరించారు కలెక్టర్లు. గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల నాయకుడితో ఫోన్లో మాట్లాడినట్లు మంత్రికి, ఎంపీకి వివరించారు కలెక్టర్లు. ఏడుగురు మత్స్యకారుల్లో ఆరుగురికి లైఫ్ జాకెట్లు ఉన్నాయని.. ఒకరికి లైఫ్ జాకెట్ లేనట్లుగా చెప్పారు కలెక్టర్లు. నేవీ హెలికాప్టర్ల ద్వారా రెస్క్యూ ఆపరేషన్ చేపట్టినట్లుగా చెప్పారు కలెక్టర్లు. సముద్ర తీర ప్రాంతానికి దగ్గర్లోనే ఉండటంతో మత్స్యకారులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని మంత్రి తెలిపారు. మత్స్యకారులను సేఫ్‌గా తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ముమ్మరంగా గాలిస్తోందని మంత్రి కొండపల్లి, ఎంపీ కలిశెట్టి వివరించారు.

## పేర్ని నానిలా పార్టీలు మారలేదు

**మంత్రి సత్యకుమార్ కౌంటర్**

అనంతపురం,జూలై6: వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్నినానిపై మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. పేర్ని నాని చెట్టు పేరు చెప్పుకొని కాయలు అమ్ముకుంటారంటూ వ్యాఖ్యానించారు. 'నేను పార్టీలు మారే అవకాశవాదిని కాదు.. నాని అవకాశం కోసం పార్టీలు మారుతాడు. నా రక్తంలోనే కాషాయం ఉంది. ఒక మంత్రిగా ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ఊరుకోను అని హెచ్చరించారు. జగన్‌ను నేను వ్యక్తిగతంగా ఎప్పుడూ తిట్టలేదు.. ఆయన వ్యతిరేక సిద్ధాంతాలపైనే మాట్లాడుతాను. సంకీర్ణ ప్రభుత్వంలో నేను మంత్రిని' అని చెప్పుకొచ్చారు. జగన్ ఒక నిలకడ లేని మనిషి అంటూ మంత్రి వ్యాఖ్యానించారు. అమరావతి తొందర్లోనే పూర్తి అవుతుందన్నారు. రాజధానిపై జగన్ మాట్లాడటం చూస్తే అవగాహనా లోపం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో గవర్నమెంట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. కొన్ని చోట్ల మార్పు రావాల్సి ఉందని.. దానిపై కృషి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ప్రజల నుంచి వస్తున్న ప్రతి ఫిర్యాదుపైనా చర్యలు తీసుకుంటున్నామని సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

## పోలవరం సముద్ర తీరంలో మత్స్యకారుల గల్లంతు

**నేవీ, కోస్ట్ గార్డు అధికారులతో మంత్రి అచ్చన్న సమీక్ష**

అమరావతి,జూలై6: అనకాపల్లి జిల్లా ఎస్ రాయవరం మండలం రేవు పోలవరం సముద్ర తీరంలో పడవ బోల్తా ఘటనలో మత్స్యకారుల గల్లంతుపై మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష నిర్వహించారు. సోమవారం గల్లంతైన మత్స్యకారుల గాలింపు చర్యలపై నేవీ, కోస్ట్ గార్డు అధికారులతో సమావేశమై చర్చించారు. గాలింపు చర్యలను మరింత వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గల్లంతైన మత్స్యకారులు క్షేమంగా తిరిగి వచ్చేలా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. రెండో రోజూ ప్రత్యేక నౌక, రెస్క్యూ బోటు, హెలికాప్టర్‌తో నేవీ, కోస్ట్ గార్డు సంయుక్త గాలింపు కొనసాగుతోందని మంత్రికి అధికారులు తెలిపారు. కారి చిన్న ఇచ్చిన సమాచారం ఆధారంగా మిగిలిన ఆరుగురు మత్స్యకారుల కోసం గాలింపు కొనసాగిస్తున్నామన్నారు. కోస్ట్ గార్డు తీసుకురానుంది. గల్లంతైన వారిలో కారి గంగయ్య, అమర అప్పలరాజు, కారి సితోడు, మేడ చిన అమ్మోరు, కారి చిన్నయ్య, రాగుతూ బండియ్యలు ఉన్నారు.

## తిరుమలకు కాలినడకన 116 ఏళ్ల వృద్ధురాలు

**విఐపి బ్రేక్ దర్శనం కల్పించిన అధికారులు**

తిరుమల,జూలై6: శ్రీవారి దర్శనం కోసం కాలినడకన వచ్చిన 116 ఏళ్ల వృద్ధురాలు నవనీతమ్మకు టీటీడీ వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించింది. నవనీతమ్మతో పాటు ఆమె కుటుంబసభ్యులకు వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించారు. ఈ విషయాన్ని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఎక్స్ వేదికగా వెల్లడించారు. వందేళ్లు దాటిన వృద్ధురాలు శనివారం నాడు అలిపిరి నడక మార్గంలో తిరుమలకు వచ్చారు. దీనికి సంబంధించిన వీడియోను కొంతమంది సోషల్‌మీడియాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. అయితే ఆ వృద్ధురాలిది కర్ణాటక అని మొదట ప్రచారం జరిగింది. ఇది చూసిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వృద్ధురాలి వివరాలు తెలిస్తే టీటీడీ ఆఫీసులో సంప్రదించాలని ఎక్స్‌లో పోస్టు కోరారు. ఈ క్రమంలో టీటీడీ విజిలెన్స్ సిబ్బంది ఆమె వివరాలను సేకరించారు. వృద్ధురాలిని తమిళనాడుకు చెందిన నవనీతమ్మగా గుర్తించి, టీటీడీ చైర్మన్‌కు సమాచారం అందించారు. వృద్ధురాలి వివరాలను తెలుసుకున్న బీఆర్ నాయుడు ఆమెతో పాటు కుటుంబసభ్యులకు వీఐపీ బ్రేక్ దర్శనం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం టీటీడీ అధికారులు వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించారు. రంగనాయకుల మండపంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర వేదపండితులతో వేదాశీర్వచనం చేయించి, పట్టువస్త్రం కప్పి, అందజేశారు. నవనీతమ్మకు నమస్కరించి ఆశీర్వాదం కూడా తీసుకున్నారు.దీనిపై బీఆర్ నాయుడు మరోసారి స్పందిస్తూ.. నవనీతమ్మను గుర్తించడంలో తమవంతు సహకారం అందించిన సోషల్‌మీడియా మిత్రులందరికీ, అలాగే టీటీడీ విజిలెన్స్ అధికారులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## కనకదుర్గమ్మకు భారీగా ఆదాయం

**హుండీ లెక్కింపులో రూ.3 కోట్లపైగా నగదు రాక**

విజయవాడ,జూలై6: విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై వెలసిన దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో హుండీ ఆదాయం భారీగా వచ్చింది. హుండీల ద్వారా రూ.3 కోట్ల 39 లక్షల 53 వేల 599లు ఆదాయం సమకూరింది. అలాగే 568 గ్రాముల బంగారం, 3 కిలోల 330 గ్రాముల వెండితో పాటు వివిధ దేశాలకు చెందిన విదేశీ కరెన్సీని కూడా భక్తులు సమర్పించారు. 16 రోజుల హుండీ లెక్కింపును పరిశీలిస్తే రోజుకు సగటున రూ.21 లక్షల 23 వేల మేర అమ్మవారి హుండీ ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అమ్మవారి హుండీలను సోమవారం లెక్కించారు. ఈ కార్యక్రమం ఆలయ ఈవో శీనా నాయక్ పర్యవేక్షణలో నిర్వహించారు. మొత్తం 16 రోజులకు సంబంధించిన హుండీలను లెక్కించగా భక్తులు సమర్పించిన విరాళాల ద్వారా భారీ ఆదాయం లభించింది. భక్తుల నుంచి వస్తున్న విరాళాలు కనకదుర్గమ్మపై ఉన్న అపారమైన విశ్వాసాన్ని చూపుతుందని పేర్కొన్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని పారదర్శకంగా పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు. నగదు, బంగారం, వెండి రూపంలో భక్తులు సమర్పించిన కానుకలు ఆలయ అభివృద్ధి, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు వినియోగించనున్నట్లు సమాచారం. కనకదుర్గమ్మ దర్శనానికి రాష్ట్రంతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుండటంతో ఆలయ ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతోంది. తాజాగా హుండీ లెక్కింపులో నమోదైన రూ.3.39 కోట్ల ఆదాయం ఆలయానికి భక్తుల నుంచి లభిస్తున్న విశేష ఆదరణకు నిదర్శనంగా నిలిచింది.

## అభివృద్ధికి అడ్డుపడితే గుణపాఠం తప్పదు

**వైసిపికి మంత్రి నారాయణ హెచ్చరిక**

నెల్లూరు,జూలై6: ఏపీలో జరుగుతున్న అభివృద్ధి పనులకు అడ్డుపడితే ప్రజలు సహించరని.. మంచిని చెడుగా చూపిస్తే, ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పురపాలక శ్శాఖ మంత్రి నారాయణ హెచ్చరించారు. సోమవారం నెల్లూరులో మంత్రి నారాయణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మల్లెల సంజీవయ్య హైస్కూల్, ప్రైమరీ స్కూల్‌లో మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో మూసేసిన వీఆర్సీని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పున: ప్రారంభించామని మంత్రి తెలిపారు. వీఆర్సీని తలదన్నేలా మరో 15 హైస్కూల్స్‌ను ఆధునికీకరిస్తున్నామని చెప్పుకొచ్చారు. వచ్చే విద్యా సంవత్సరానికి అన్ని స్కూల్స్ సిద్ధం చేస్తామని వెల్లడించారు. వైసీపీ నేతలు వాటిపైనా విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాజకీయ లబ్ధికోసం, ఉనికి కోసం జగన్ అండ్ కో ఆరోపణలు చేస్తే చెడ్డవారిగా మిగిలిపోతారని హెచ్చరించారు. పరిశుభ్రతతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. మంత్రి లోకేశ్ ఆలోచనలకు అనుగుణంగా నెల్లూరులో స్కూల్స్‌ను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# ఖమ్మంలో అధ్వాన్నంగా పారిశుద్ధ్యం

**మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**

ఖమ్మం,జూలై6: పారిశుద్ధ్య నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆరోపించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే సమగ్ర ప్రణాళిక రూపొందించి పారిశుద్ధ్య సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం దృష్ట్యా ఖమ్మం జిల్లాను పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించారు. పారిశుద్ధ్యం లోపించడం అపరిశుభ్రత కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రతిచోటా చెత్త పేరుకుపోవడం, మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు.

# కారేపల్లిలో ఘనంగా పెద్దమ్మతల్లి బ్రహ్మోత్సవాలు

ఖమ్మం,జూలై6: కారేపల్లిలోని పురాతన దేవాలయమై శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో సోమవారం వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల రెండో రోజు ఆలయంలో అర్చకులు ముక్కామాల మల్లిఖార్జున శర్మ, సురేష్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభిషేకములు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులతో కుంకుమ పూజలు, గణపతి, మృత్యుంజయ నవగ్రహా శాంతి పూజలు జరిపించారు. అనంతరం ఆలయం కమిటీ అధ్వర్యంలో మహాఅన్నదాన కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ మేదరి వీరప్రతాఫ్ (టోనీ), మాజీ వైస్ ఎంపీపీ దంపతులు ఇమ్మడి రమాదేవి–తిరుపతిరావు ప్రారంభించారు.

# బాలిక కిడ్నాప్ కేసులో నలుగురిపై పోక్సో కేసు

ఖమ్మం,జూలై6: కారేపల్లి మండల కేంద్రంలో గల ఓ ప్రభుత్వ గురుకుల కళాశాల నుండి ఇంటర్ చదువుతున్న బాలికను కిడ్నాప్ చేసిన నలుగురు వ్యక్తులపై కిడ్నాప్, పోక్సో కేసు నమోదు కాగా నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు కారేపల్లి పోలీసులు సోమవారం తెలిపారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దుర్గాభవాని ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఖమ్మం పట్టణంలోని టేకులపల్లి ప్రాంతంలో నివాసముంటూ నిందితుడికి సహకరించిన మరో ముగ్గురు మహిళలను కూడా ఈ కేసులో అరెస్ట్ చేసినట్లు ఆయన వెల్లడించారు.

# పర్యాటక పాంతాల అభివృద్ధికి పెద్దపీట

**తారామతి బారాదరి, దుర్గం చెరువుల అభివృద్ధి**
**మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌ల ఆధునికీకరణ**
**ఎకో టూరిజం పార్కుల అభివృద్ధికి చర్యలు**
**పర్యాటకంపై సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశాలు**

హైదరాబాద్,జూలై6: తారామతి బారాదరి, దుర్గం చెరువులను పూర్తిస్థాయి పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పర్యాటక కేంద్రాలను గుర్తించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధికి అసవరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో పర్యాటకశాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునికీకరించాలని.. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్నారు. అక్కడ వీరభద్ర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు యాదగిరిగుట్ట తరహాలో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూర్ పరిధిలోని అటవీశాఖ భూములను ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలన్నారు.గుర్రంగూడ ఎకో పార్కు తరహాలో నగరంలో మరిన్ని పార్కులను తీర్చిదిద్దాలని సూచించారు. ఫ్యూచర్ సిటీలోని అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలి. అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టుల కోసం ప్రత్యేకాధికారులను నియమించాలన్నారు. పురానాపూల్, హెరిటేజ్ బ్రిడ్జిలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలి. ట్రాఫిక్‌ను మళ్లించి బ్రిడ్జిపై పర్యాటకుల కోసం ఏర్పాట్లు చేయాలి. డిసెంబర్‌లో జరిగే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమిట్ ఏర్పాట్లు ప్రారంభించాలని సీఎం రేవంత్ దిశానిర్దేశర చేశారు.

# గురుకులాల్లో నాణ్యమైన భోజనం కరువు

**ఎమ్మెల్యే కోవ లక్ష్మ విమర్శలు**

ఆసిఫాబాద్,జూలై6: కేసీఆర్ ప్రారంభించిన గురుకులాల్లో గిరిజన విద్యార్థులకు నాణ్యమైన అందించారని ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి అన్నారు. వాటిని ఇప్పుడు అధ్వాన్నంగా మార్చారని అన్నారు. నాణ్యమైన భోజనం కూడా పెట్టడం లేదన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం బుసిమెట్టలోని గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో కంపౌండ్ వాల్ నిర్మాణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన బిడ్డల చదువుకు , భద్రతకు నాటి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. కంపౌండ్ వాల్ నిర్మాణం పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మండల మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్, ఫాక్స్ చైర్మన్ కొడప హన్ను పటేల్, జైనూర్ సర్పంచ్ కొడప ప్రకాష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజులాల, అధికారులు పాల్గొన్నారు.

# మత్స్య అభివృద్ధి పథకాలతో మత్స్యకారులకు మేలు

**కలెక్టర్ గరిమా అగర్వాల్ వెల్లడి**

రాజన్నసిరిసిల్ల,జూలై6: ప్రభుత్వం అమలు చేస్తున్న మత్స్య అభివృద్ధి పథకాలు గ్రామీణ మత్స్యకారుల జీవనోపాధిని బలోపేతం చేస్తున్నాయని, చేపల ఉత్పత్తి పెరగడంతో వారి ఆదాయం గణనీయంగా పెరుగుతోందని రాజన్నసిరిసిల్ల కలెక్టర్ గరిమా అగర్వాల్ తెలిపారు. ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వ అధికారులు, జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు కమిటీ సభ్యులు సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్‌తో సమావేశమై జిల్లాలో అమలవుతున్న మత్స్య అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. సహకార సంఘాలకు అందిస్తున్న ఆర్థిక సహాయం, చేప పిల్లల ఉత్పత్తి, మార్కెటింగ్, మత్స్యకారుల సంక్షేమానికి చేపడుతున్న చర్యలను కలెక్టర్ బృందానికి వివరించారు. అనంతరం బృందం బోయినపల్లి మండలంలోని నర్సింగాపూర్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించి ఉత్పత్తి విధానం, నిర్వహణ, ఆదాయ వనరులు, ప్రభుత్వ సహకారంపై క్షేత్రస్థాయిలో పరిశీలించింది. చేపల ఉత్పత్తి పెంపుతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు మత్స్యకార కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని అధికారులు వివరించారు. ఈ పర్యటనలో వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులు జూలియన్ మిలియన్, అనుజా శుక్లా, ఆర్పీ సిలార్డ్, ఇంతిసార్ ఎ. సిద్దిఖీ, దీపా సుమన్, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులపై నిషేధం

**13నుంచి అమలుకు ఎపి ప్రభుత్వం నిర్ణయం**

అమరావతి,జూలై6: ఏపీ ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, బదిలీలపై నిషేధానికి అమలు తేదీ ఖరారైంది. జులై 13వ తేదీ నుంచి పోస్టుల సృష్టి, అప్‌గ్రేడేషన్‌పై ఏపీ ప్రభుత్వం నిషేధం అమలు చేయనుంది. కొత్త నియామకాలు, పదోన్నతులు, బదిలీలు, డిప్యుటేషన్లపై నిషేధం విధించింది. స్థానిక కేడర్ల కేటాయింపు పక్రియ పూర్తయ్యే వరకు నిషేధం కొనసాగించనుంది. పీఓ–2025 అమలు నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్థిక శాఖ (హెచ్‌ఆర్–ఎ÷–లానింగ్–పాలసీ) ఆధ్వర్యంలో ఈ మెమో జారీ చేసింది. కొన్ని శాఖల్లో కేడర్ కేటాయింపుల పక్రియ పూర్తి కాకపోవడంతో గడువు పొడిగించింది. ఉద్యోగ సంఘాల విజ్ఞప్తితో నిషేధం అమలు తేదీపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. జులై 5వ తేదీతో ముగియాల్సిన పక్రియకు అదనపు గడువు ఇచ్చింది. అన్ని శాఖలు ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

# కాళేశ్వరంను కూలేశ్వరం చేసింది ఎవరు?

## లక్ష కోట్లు పెట్టి ప్రజల సొమ్ము దుబారా చేశారు.. కాళేశ్వరంపై కెటిఆర్ డ్రామాలు కట్టిపెడితే మంచిది

**బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి సీతక్క**





మహబూబాబాద్,జూలై6: కాళేశ్వరం పేరుతో కెటిఆర్ డ్రామాలు చేస్తున్నారని మంత్రి సీతక్క ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ తీరుపై పై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మహబూబాబాద్‌లో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. కేటీఆర్‌కు అధికార దాహమే తప్ప... ప్రజలపై ప్రేమ లేదని విమర్శించారు.పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారని మంత్రి ప్రశ్నించారు. కాళేశ్వరం కట్టింది.. కూలిపోయింది బీఆర్ఎస్ హయాంలోనే అని ప్రస్తావించారు. కాళేశ్వరం పేరుతో లక్షన్నర కోట్లను వృథా చేశారని ఆరోపించారు. మళ్లీ అధికారం కావాలంటున్నారని.. ఆ ప్రాజెక్టులో నీటిని నిల్వచేస్తే పరివాహక గ్రామాలన్నీ కొట్టుకుపోవాలని కేటీఆర్ చూస్తున్నారా.. అని మంత్రి సీతక్క ప్రశ్నించారు. పదేళ్లలో తెలంగాణ ప్రజల జీవితాలను బీఆర్ఎస్ తాకట్టు పెట్టిందని మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో నీటి పారుదల శాఖను నాశనం చేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నాయకులు ఏది ముట్టుకుంటే అది నాశనమని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ఇరిగేషన్ శాఖను చక్కదిద్దామని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నాయకుల లాభం కోసం కాళేశ్వరం కట్టారు తప్ప.. తెలంగాణ ప్రజల కోసం కాదని చెప్పుకొచ్చారు. కోట్లు ఖర్చు చేసి నామమాత్రపు ఆయకట్టు ఇచ్చారని మంత్రి తెలిపారు. ఆ ప్రాజెక్టులు అన్ని అసంపూర్తిగా ఉన్నాయని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది కేసీఆర్ హయాంలోనే.. కూలిపోయింది వాళ్ల హయాంలోనే అని ఇంజినీర్లు రిపోర్ట్ ఇచ్చారని ప్రస్తావించారు. కన్నెపల్లి పంపు దగ్గరకు పోయి ప్రాణహిత పంపు ఆన్ చేసి నీళు ఇవ్వాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ నాటకాలు ఆడుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సరిగ్గా కడితే ఈ పరిస్థితి వచ్చేది కాదని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ వల్లే కాళేశ్వరం నీళ్లు ఉపయోగించలేక పోతున్నామని అన్నారు. నాసిరక నిర్మాణం వల్లే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు ఉపయోగించలేక పోతున్నామని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఫౌండేషన్ తప్పుగా ఉందని అధికారులు రిపోర్ట్ ఇచ్చారని తెలిపారు. కాళేశ్వరం ఇలానే కొనసాగిస్తే ప్రమాదమని అంతర్జాతీయ, జాతీయ నీటి నిపుణులు నివేదిక ఇచ్చారని అన్నారు. కేటీఆర్ కన్నా ఎన్డీఎస్ఏ అధికారులకు నాలెడ్జ్ ఎక్కువగా ఉందని తాను అనుకుంటున్నానని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు స్టోరేజ్ చేసినప్పుడు కూలిపోతే కింద ఉన్న 40 ఊర్లు, భద్రాచలం కొట్టుకుపోతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు కమిషన్లకు కక్కుర్తి పడి తుమ్మడిహెట్టి వద్ద ప్రాజెక్ట్ కట్టకుండా తెలంగాణ ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. లేకపోతే ఎప్పుడో ఉత్తర తెలంగాణ సస్యశామలం అయ్యేదని వివరించారు. తెలంగాణ ప్రజలకు అన్యాయం చేసింది కాక ఇప్పుడు ఎదురుదాడి విమర్శలు చేయడంపై మంత్రుఇ సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ నేటితో పూర్తి కావాలి

**పట్టణ ప్రాంతం కలెక్టర్లు దీనిపై శ్రద్ధవహించాలి**
**బిఎల్‌వోలు సక్రమంగా పనిచేసేలా చూడాలి**
**కలెక్టర్లను ఆదేశించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**



హైదరాబాద్,జూలై6: ఈ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమం మంగళవారం నాటికి ఎట్టి పరిస్థితులలో పూర్తి చేయాలని కలెక్టర్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలతో పాటు పట్టణ ప్రాంతం కలెక్టర్లు దీనిపై శ్రద్ధవహించి వందశాతం ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ అయ్యేలా చూడాలన్నారు. అదనపు సిఇఒ వాసం వెంకటేశ్వర్లు తో కలిసి సోమవారం ఎస్ఐఆర్ పక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమ పురోగతిపై కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో సూపర్ వైజర్ల ముఖ్య పాత్ర పోషించాలన్నారు. ఎక్కడైతే బిఎల్ఓలు బలహీనంగా ఉన్నారో వారిని గుర్తించి ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో వారికి సూపర్ వైజర్లు సహకరించాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో స్థానికంగా వాలంటీర్లను గుర్తించి వారి ద్వారా పూరించేందుకు ఓటర్లకు సహకరించాలని సూచించారు. సంబంధిత సూపర్ వైజర్ల ఫోన్ నెంబర్లను మీడియా ద్వారా తెలియజేయాలని కలెక్టర్లను ఆదేశించారు. హైదరబాద్లో ఇప్పటికే ప్రారంభమైన 16 హెల్ప్ డెస్క్ లతో పాటు అవసరమైన చోట అదనంగా హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలని కలెక్టర్లను సిఇఒ ఆదేశించారు. పూర్తయిన ఎన్యూమరేషన్ ఫారాలలో సదరు ఓటరు, బిఎల్ఒ సంతకాలు ఉండేలా చూడాలని దీంతో పాటు ఫోటోలు ఉండేలా చూడాలని సిఇఒ ఆదేశించారు. ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు విస్తృతంగా క్షేత్రస్థాయిలో పర్యటించి సర్ పక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలకు సంబంధించి డిజిటలైజేషన్ పక్రియను ప్రారంభించాలన్నారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ పక్రియను కూడా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వివిధ పోలింగ్ కేంద్రాలలో కాకుండా ఒకే పోలింగ్ కేంద్రంలో వారి పేర్లు ఉండేవిధంగా చూడాలన్నారు. ఆన్ లైన్ ద్వారా వచ్చిన ఎన్యూమరేషన్ ఫారాలను కూడా బిఎల్ఒలు సరి చూసు కోవాలని, ఎన్యూమరేషన్ ఫారాలను నింపడంలో మరోసారి బిఎల్ఒలకు, సూపర్ వైజర్లకు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్లను సిఇఒ ఆదేశించారు. బిఎల్ఒలు తప్పనిసరిగా రాజకీయ పార్టీలతో సమావేశాలు జరిగేవిధంగా చూడాలని, సర్ పక్రియపై వారికి అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సిఇఒ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో డిప్యూటీ ఎన్నికల అధికారి చారి, డిప్యూటీ కలెక్టర్ చెన్నయ్య, చిరంజీవి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 500 కోట్ల సాస్కి నిధులతో గురుకుల భవనాలు

**అదనంగా మరో 10 కొత్త బీసీ గురుకులాల ఏర్పాటు**
**మంత్రి సవిత వెల్లడి**



అమరావతి,జూలై6: రూ.500 కోట్ల సాస్కి నిధులతో ఎంజేపీ గురుకులాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి సవిత చెప్పారు. రాష్ట్రంలో ఉన్న 109 గురుకులాలకు అదనంగా మరో 10 కొత్త బీసీ గురుకులాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీసీ విద్యార్థులకు నీట్, ఐఐటీ ప్రవేశాల కోసం టేకులోడు, సింహాచలంలో రెండు ఎక్సలెన్స్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు.బీసీ సంక్షేమానికి తొలి మూడు బడ్జెట్లలో వరుసగా రూ.39 వేల కోట్లు, రూ.47 వేల కోట్లు, రూ.51 వేల కోట్లను కూటమి ప్రభుత్వం కేటాయించిందని మంత్రి సవిత తెలిపారు. సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. మూడో బడ్జెట్‌లో బీసీల సంక్షేమం కోసం రికార్డు స్థాయిలో రూ.51 వేల కోట్లు కేటాయించామన్నారు. ఆరు బాలికల గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉన్నత విద్యకు అవకాశం కల్పిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. రూ.26.71 కోట్లతో 62 ఎంజేపీ గురుకుల భవనాల మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం, క్రీడా సామగ్రి, ట్రాక్‌సూట్లను అందజేస్తున్నామన్నారు. చెస్‌లో ప్రతిభ పెంపొందించేందుకు ఏపీ చెస్ అకాడమీతో ఎంవోయూ కుదుర్చుకున్నామని తెలిపారు. 998 బీసీ హాస్టళ్లలో 85 వేల మంది విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. రెండేళ్లలో రూ.80 కోట్లతో బీసీ హాస్టళ్ల మరమ్మతులు, మౌలిక వసతులను అభివృద్ధి చేశామని మంత్రి తెలిపారు. 772 హాస్టళ్లలో ఆర్వో ఎ÷–లాంట్లు, 642 హాస్టళ్లలో ఇన్వర్టర్లను ఏర్పాటు చేశామన్నారు. సివిల్స్, డీఎస్సీ, గ్రూప్–1, గ్రూప్–2 పోటీ పరీక్షలకు బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. విశాఖపట్నం, అనంతపురం, తిరుపతిలో మూడు ప్రత్యేక బీసీ స్టడీ సర్కిళ్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రూ.1000 కోట్లతో ఆదరణ–3.0 అమలు చేసి బీసీలకు ఆధునిక పరికరాలను పంపిణీ చేస్తామన్నారు. బీసీల ఆత్మగౌరవం కోసం దేశంలోనే తొలి బీసీ రక్షణ చట్టాన్ని ప్రభుత్వం తీసుకురానుందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అన్ని జిల్లా కేంద్రాల్లో బీసీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సవిత తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రెండేళ్లలో 117.68 లక్షల మంది లబ్దిదారులకు రూ.32,533.68 కోట్ల సహాయం అందించామన్నారు. గత ఐదేళ్ల కాలంలో గొడ్డలి పార్టీ అక్రమాలకు చట్టప్రకారం శిక్ష తప్పదని హెచ్చరించారు. రైజింగ్ రాయలసీమ.. సీఎం చంద్రబాబు నాయుడు నమ్మిన సిద్దాంతమన్నారు. అన్ని రంగాల్లోనూ రాయలసీమను దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టేలా రేయింబవళ్లు కృషి చేస్తున్నారని తెలిపారు. హార్టికల్చర్, ఐటీ, పారిశ్రామిక, డిఫెన్స్, పర్యాటక , డ్రోన్ హబ్‌లుగా రాయలసీమను ముందంజలో నిలబెడుతున్నారని అన్నారు. గడిచిన రెండేళ్లలో రాష్టాన్రికి వచ్చిన పెట్టుబడుల్లో దాదాపు మూడో వంతు అంటే రూ.85 వేల కోట్లకు పైగా పెట్టుబడులు రాయలసీమకే వచ్చాయని మంత్రి సవిత పేర్కొన్నారు.

# హైడ్రా దూకుడుతో పేదలకు నష్టం

**పేదల ఇళ్లు కూలగొట్టి పెద్దలకు కట్టబెట్టే పన్నాగం**
**సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ ఎంపి ఈటెల రాజేందర్**

హైదరాబాద్,జూలై6: హైదరాబాద్‌లో హైడ్రా వ్యవహరిస్తున్న తీరు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న విధానాలపై మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలొచ్చినా సీఎం రేవంత్ రెడ్డి ఓడిపోవడం ఖాయమని ప్రజలు అంటున్నారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అబద్దాలు చెప్పడంలో ఉన్న క్లారిటీ ప్రజలకు లేదని, అమెరికా గడ్డపై నిలబడి ఆయన అబద్దాలు చెబితేనే జనం నమ్ముతారనే భ్రమల్లో ఉన్నారని ఎద్దేవా చేశారు. దానికి పరాకాష్టగా తాను హిట్లర్ నుంచి 'హైడ్రా' అనే పదాన్ని తీసుకున్నానని సీఎం స్వయంగా ఒప్పుకున్నారని, దీన్నిబట్టే ఆయన నైజం ఏంటో అర్థం చేసుకోవచ్చని విమర్శించారు. గత ప్రభుత్వాలు పేదలకు ఇళ్ల జాగాలిచ్చి ఆదుకుంటే, రేవంత్ రెడ్డి మాత్రం పేదవాడి ఇళ్లను కూలగొట్టి, ఆ స్థలాలను పెద్దవాళ్లకు అంటగట్టడమే ఎజెండాగా పెట్టుకున్నారని, ఇలాంటి హిట్లర్ వారసత్వ సంస్థతో ప్రజలకు న్యాయం జరుగుతుందనుకోవడం భ్రమ అని దుయ్యబట్టారు. తాను మొదట్లో ఒంటరిగా నాలుగు నెలల పాటు హైడ్రాకు వ్యతిరేకంగా పోరాడినప్పుడు చాలామంది ప్రశ్నించారని, కానీ ఇప్పుడు హైడ్రా నిజస్వరూపం ఏంటో అందరికీ తెలిసిందని, చివరకు న్యాయస్థానాలు కూడా అదే విషయాన్ని స్పష్టం చేశాయని ఈటల రాజేందర్ గుర్తుచేశారు. రాజ్యాంగ బద్ధంగా పనిచేయాల్సిన ప్రభుత్వ యంత్రాంగాన్ని పక్కనబెట్టి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తనకు ఏ చట్టాలతో, కోర్టులతో సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. శని, ఆదివారాలు చూసుకుని ఇళ్లను ధ్వంసం చేయడంపై కోర్టు సైతం తీవ్రంగా మందలించిందని.. 'నీకు చట్టమంటే గౌరవం లేదా? నువ్వు చట్ట పరిధిలోకి రావా? జాగ్రత్తగా ఉండకపోతే జైల్లో పెడతాం' అని హెచ్చరించినా ఆయన తీరు మార్చుకోవడం లేదని, ఇలాగే ముమ్ముందు వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అస్మత్‌పేటలో ఇల్లు కూల్చివేతతో ఒక మహిళ ఏడ్చిన విధానం హైదరాబాదు బస్తీల్లో ఉన్న ప్రతి పేదవాడి ఆవేదనకు అద్దం పడుతోందని, వీరందరికీ తెలంగాణలోని పేదల మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. హైడ్రా పేరుతో సాగుతున్న ఈ డ్రామాలకు, రేవంత్ రెడ్డి అహంకారానికి రాబోయే మున్సిపల్, జీహెచ్‌ఎంసీ (ఉఈఓఅ) ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా తగిన సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఈటల రాజేందర్ హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ ప్రజావ్యతిరేక నిర్ణయాల వల్ల రాబోయే ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని జోస్యం చెప్పారు. పేదవాడి గూడును చెడగొట్టి కూల్చివేతల రాజకీయం చేస్తున్న రేవంత్ రెడ్డి అరాచక పాలనకు అంతం దగ్గర పడిందని, ప్రజల ఆగ్రహానికి ఈ ప్రభుత్వం కొట్టుకుపోవడం ఖాయమని ఈటల రాజేందర్ ఘాటుగా విమర్శించారు.

# సిపిఐ నేత కుటుంబానికి చాడ పరామర్శ

కరీంనగర్,జూలై6: చిగురుమామిడి మండలంలోని గాగిరెడ్డిపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సీపీఐ సీనియర్ నాయకులు దొంతరవేణి వెంకన్న కుటుంబాన్ని సోమవారం సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పరామర్శించారు. వెంకన్న సీపీఐకి అంకితభావంతో పనిచేస్తూ విధేయుడుగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేశాడని అన్నారు. గ్రామ కార్యదర్శి, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా పార్టీ అప్పగించిన బాధ్యతలను తూచా తప్పకుండా అమలు చేసేవాడని కొనియాడారు.వెంకన్న మృతి పార్టీకి తీరనిలోటని అన్నారు. వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. వీరి వెంట రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందే స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉన్నారు

# ఈఎస్ఐ ఆస్పత్రి త్వరితగతిన నిర్మించాలి

**కలెక్టర్‌ను కోరిన ఐదక్యవేదిక ప్రతినిధులు**

కరీంనగర్,జూలై6: రామగుండం నియోజక వర్గానికి మంజూరైన ఈఎస్ఐ ఆస్పత్రి త్వరితగతిన నిర్మించాలని స్వచ్ఛంద సంఘాల ఐక్య వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. వేదిక ప్రతినిధులు మ్మదెల దినేష్, గోలివాడ చంద్రకళ, దుర్గం నగేష్ మాట్లాడుతూ ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆస్పత్రి స్థల సేకరణ, నిర్మాణంలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. దీంతో అసంఘటిత కార్మికులు వైద్య సేవలకు నోచుకోవడం లేదని మండిపడ్డారు. వంద పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.వంద కోట్లు నిధులు మంజూరు చేసినా జిల్లా అధికారుల నిర్లక్ష్యంతో అడుగు ముందుకు పడటం లేదన్నారు. పారిశ్రామిక ప్రాంత ప్రగతికి కార్మికుల ఆరోగ్య భద్రత అత్యంత కీలకమనీ, ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం జరిగితే వేలాది మంది కార్మికులు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. తక్షణమే రామగుండంలో వంద పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి పునాది వేయాలని కలెక్టర్‌ను కోరారు.

# పెట్టుబడుల కోసం లైజన్ అధికారుల నియామకం

అమరావతి,జూలై6: ఏపీ ప్రభుత్వం కోసం లైజన్, స్పెషల్ రిప్రజెంటేటివ్‌ల నియమించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉత్తర అమెరికాలో పెట్టుబడుల కోసం ప్రిన్సిపల్ లైజన్‌గా సతీశ్ మండువని ప్రభుత్వం నియమించింది. పశ్చిమాసియా, ఇతర దేశాలకు ప్రత్యేక ప్రతినిధిగా రాధాకృష్ణ రావిని నియమించింది. యూరప్‌కు ప్రత్యేక ప్రతినిధిగా జయకుమార్ గుంటుపల్లి నియమించింది. ప్రపంచంలోని మిగిలిన దేశాలకు ప్రత్యేక ప్రతినిధిగా శ్రీనివాస్ పల్లపోతు నియమించింది. విదేశీ పెట్టుబడులు, అంతర్జాతీయ సమన్వయానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రతినిధులను నియమించింది.

## గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెల్ కేసు

**సిఐ నాగరాజుకు షరతులుపై విచారణ**

విజయవాడ,జూలై6: గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో నిందితుడిగా ఉన్న సస్పెండెడ్ సీఐ నాగరాజు కస్టడీకి సంబంధించి విజయవాడ కోర్టు షరతులు విధించింది. ఈ షరతులను సవరించాలని స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) దాఖలు చేసిన పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఇరువర్గాల వాదనలు పూర్తికాగా, హైకోర్టు తన తీర్పును రేపటికి రిజర్వ్ చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా ఏపీ ప్రభుత్వం తరఫున హాజరైన పబ్లిక్ ప్రాసిక్యూటర్ కీలక వాదనలు వినిపించారు. విజయవాడ కోర్టు విధించిన కొన్ని షరతుల కారణంగా దర్యాప్తు పక్రియకు ఆటంకం కలుగుతోందని ఆయన హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా నిందితుడిని ప్రశ్నించే విధానంలో విధించిన పరిమితులు దర్యాప్తు సమర్థతను ప్రభావితం చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. నాగరాజును విచారించే సమయంలో వీడియో రికార్డింగ్ నిర్వహించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. అయితే ఆడియో రికార్డింగ్ చేయడం వల్ల దర్యాప్తు గోప్యత దెబ్బతినే ప్రమాదం ఉందని, దర్యాప్తుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని హైకోర్టుకు వివరించారు. అలాగే నిందితుడు నాగరాజును కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో విచారించడం వల్ల ఆయన హక్కులకు ఎలాంటి భంగం కలగదని ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదించారు. దర్యాప్తు అవసరాల దృష్ట్యా ఈ విధానం సముచితమని పేర్కొన్నారు. మరోవైపు నాగరాజు తరఫు న్యాయవాది భిన్న వాదనలు వినిపించారు. తన క్లయింట్‌కు ప్రాణహాని పొంచి ఉందని, భద్రతాపరమైన కారణాల దృష్ట్యా కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో విచారణ నిర్వహించకూడదని హైకోర్టును అభ్యర్థించారు. అన్ని రకాల సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు ఉన్న రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలోనే విచారణ చేపట్టేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు పూర్తిగా విన్న హైకోర్టు, ఈ అంశంపై రేపు(మంగళవారం) ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించింది. సాయికృష్ణ లాకప్ డెత్ కేసు ఏపీవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నేపథ్యంలో హైకోర్టు తీర్పుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## రెండ్రోజులపాటు జగన్ పులివెందులలో పర్యటన

కడప,జూలై6: పులివెందుల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళ,బుధ వారాల్లో పర్యటించనున్నారు. ఆయన మంగళవారం ఉదయం 11.30 గంటలకు పులివెందుల చేరుకుంటారు. అనంతరం భాకరాపురం క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. రాత్రికి అక్కడి నివాసంలో బస చేస్తారు. బుధవారం ఉదయం పులివెందుల నుంచి బయలుదేరి ఉదయం 7.30 గంటలకు ఇడుపులపాయ చేరుకుంటారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద నిర్వహించనున్న ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని నివాళులర్పిస్తారు. కార్యక్రమం అనంతరం వైఎస్ జగన్ అక్కడి నుంచి తిరుగు ప్రయాణం అవుతారు.

## పులిపర్తి నానికి వ్యతిరేగా వైసిపి ఆందోళన

**తిరుపతి ఎస్పీ కార్యాలయం ముందు ఉద్రిక్తత**

తిరుపతి,జూలై6: బూతు ఎమ్మెల్యే మాకొద్దని పులివర్తి నానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆందోళనకు దిగింది. పులివర్తి నాని బూతు మాటలు, రోత పనులపై కేసు నమోదు చేయాలని వైఎస్సార్‌సీపీ నేతలు డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై పోలీసులు దాడి చేశారు. నలుగురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు వైఖరి నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని భూ కబ్జాలపై విచారణకు డిమాండ్ చేస్తూ.. వైఎస్సార్‌సీపీ నిరసన చేపట్టింది. ఎస్పీకి వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయం మెయిన్ గేట్ ఎదుట వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఇంఛార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు బైఠాయించి నిరసన తెలిపారు. రిటైర్డ్ జడ్జి గుర్రప్ప నాయుడును బూతులు తిట్టిన ఎమ్మెల్యే నానిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

## ఎపిలో పలువురు ఐపిఎస్‌ల బదిలీ

అమరావతి,జూలై6: ఏపీలో పలువురు ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. పలు జిల్లాలకు ఓఎస్డీలను, అదనపు ఎస్పీలను నియమిస్తూ కూటమి ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీల్లో భాగంగా మార్కాపూర్ జిల్లా ఓఎస్డీ (అడ్మినిస్ట్రేషన్)గా నవ్ జ్యోతి మిశ్రాను నియమించారు. తూర్పుగోదావరి (రాజమండ్రి) అదనపు ఎస్పీ అడ్మిన్‌గా పాటిల్ దేవ్ రాజ్ మనీష్‌ను బదిలీ చేశారు. అలాగే మండా జావలి అల్ఫోన్స్‌ను పోలవరం జిల్లా ఓఎస్డీగా నియమించారు. అమరావతి ఓఎస్డీ లా అండ్ ఆర్డర్‌గా మనోజ్ రామనాథ్ హెగ్డేను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. రోహిత్ కుమార్ చౌదరికి పల్నాడు జిల్లా అదనపు ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. నంద్యాల అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా (ఏఎస్పీ) సుస్మితను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పరిపాలనా అవసరాల దృష్ట్యా ఈ బదిలీలు చేపట్టినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

## ఎపిలో ముగ్గురు అదనపు న్యాయమూర్తులు

**ప్రమాణం చేయించిన ప్రధాన న్యాయమూర్తి లీసాగిల్**

అమరావతి,జూలై6: ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ముగ్గురు అదనపు న్యాయమూర్తులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్తగా నియమితులైన సునీత గంధం, ఆలపాటి గిరిధర్, పురుషోత్తమ్ కుమార్ చింతలపూడి అదనపు న్యాయమూర్తులుగా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలపడంతో కేంద్ర న్యాయశాఖ అధికారిక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ నియామకాలతో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 29 నుంచి 32కు పెరిగింది. హైకోర్టు ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం నూతన అదనపు న్యాయమూర్తులకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ శుభాకాంక్షలు తెలిపారు.

## అమరావతే ఎప్పటికీ మన రాజధాని

**జగన్ మావిగన్ రాజకీయ ఎత్తుగడ**

**మండిపడ్డ బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు**

విశాఖపట్నం,జూలై6: అమరావతే రాజధాని అని, ఇందులో అనుమానం లేదని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు గతంలో జగన్‌తో సహా అన్ని పార్టీలు ఒప్పుకున్నాయని గుర్తుచేశారు. 2019లో అధికారంలోకి రాగానే జగన్ మాట మార్చి మూడు రాజధానులు అన్నారని మండిపడ్డారు. కూటమి హయాంలో రాష్ట్ర అభివృద్ధిని చూడలేక జగన్ ఏవేవో కామెంట్స్ చేస్తున్నారని విమర్శించారు. మాటమార్చి మాట్లాడుతున్న మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో 'మావిగన్' పెడతానని జగన్ చెప్పడం దురదృష్టకరమన్నారు. ఇప్పుడు మావిగన్ అంటున్నారని.. జగన్ ఇప్పటికైనా రాజకీయ కుట్రలు మానాలని హితవుపలికారు. ఏపీ రాజధాని అమరావతిగా కేంద్రం ప్రకటించిందని... ఎప్పటికీ రాజధానిగా అమరావతే ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మావిగన్ మీద మాట్లాడాలంటే జగన్ అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలన్నారు.





# బీచ్ షాక్స్ విధానంపై మహిళల నిరసన

**విశాఖ బీచ్‌లో వైసిపి మహిళా విభాగం ఆందోళన**

విశాఖపట్టణం,జూలై6: కూటమి సర్కార్ ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'బీచ్ షాక్స్' విధానానికి వ్యతిరేకంగా విశాఖలో నిరసన జ్వాలలు మిన్నంటాయి. సముద్ర తీర ప్రాంతాల్లో మద్యం విక్రయాలకు అనుమతినిస్తూ కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 362ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో విశాఖ బీచ్ రోడ్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వైజాగ్‌తో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వేలాది మంది మహిళలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా మహిళలందరూ చేతుల్లో నల్ల బెలూన్లు, నల్ల రిబ్బన్లు ధరించి ప్రదర్శనలో పాల్గొన్నారు. బీచ్ రోడ్ అంతటా ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వైఎస్ఆర్సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ భారీ ప్రదర్శనకు పార్టీ అగ్రశ్రేణి నాయకులు పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ ర్యాలీలో వరుదు కళ్యాణి, బొత్స ఝాన్సీ లక్ష్మి, గొల్ల బాబురావు, పార్టీ నేత కేకే రాజు, పలువురు మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలు స్వయంగా పాల్గొని మహిళలకు అండగా నిలిచారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సీపీ నేతలు మాట్లాడుతూ.. గోవా తరహా సంస్కృతిని ఏపీలోకి తీసుకువచ్చి, పవిత్రమైన విశాఖ తీరాన్ని మందుబాబుల అడ్డాగా మార్చాలని చంద్రబాబు ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు బీచ్‌లలో మద్యం అమ్మకాలకు అనుమతి ఇస్తే, ఇకపై ఇక్కడికి కుటుంబాలు, విద్యార్థులు, మహిళలు ధైర్యంగా వచ్చే వాతావరణం ఉంటుందా? అని ప్రశ్నించారు. పర్యాటక రంగం అభివృద్ధి పేరుతో మహిళల భద్రతను, ప్రజల శాంతిని పణంగా పెట్టడం దుర్మార్గమని ధ్వజమెత్తారు.





# ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు.. లక్ష ఉద్యోగాలు

**ఎపి లక్ష్యం ఇదేనని వెల్లడించిన మంత్రి లోకేశ్**

అమరావతి,జూలై6: ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు, లక్ష ఉద్యోగాలే లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్' లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. సోమవారం దక్షిణ కొరియాలో సియోల్ బిజినెస్ ఏజెన్సీ కొరియన్ స్టార్టప్ ఫౌండర్లతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ పాల్గొని మాట్లాడారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లోకి కొరియన్ స్టార్టప్‌లకు ఆహ్వానం పలికారు. భారతదేశ ఏఐ రాజధానిగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతామని చెప్పుకొచ్చారు. అమరావతి కేంద్రంగా ఆర్టీఐహెచ్.. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి, అనంతపురంలో ప్రాంతీయ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని మంత్రి లోకేశ్



తెలిపారు. ఇప్పటికే 2,500కు పైగా స్టార్టప్‌లకు ఆర్టీఐహెచ్ మద్దతు ఇచ్చిందని వివరించారు. 5,200 మందికి పైగా వ్యవస్థాపకులకు ఇన్నోవేషన్ హబ్ భాగస్వామ్యం కల్పించిందని వెల్లడించారు. స్టార్టప్‌లకు సీడ్ ఫండ్, డీప్ టెక్ గ్రాంట్లు, పెట్టుబడి సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. భాగస్వామ్యంతో డీప్ టెక్ ఏంజెల్ ఫండ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇండియా-కొరియా స్టార్టప్ కారిడార్ ఏర్పాటుకు కలిసి పనిచేద్దామని మంత్రి లోకేశ్ సూచించారు. కొరియన్ కంపెనీల కోసం ప్రత్యేక 'కొరియా డెస్క్' ఏర్పాటుకు ప్రతిపాదన చేశామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టార్టప్‌లకు కొరియా మార్కెట్.. కొరియా స్టార్టప్‌లకు భారత్ మార్కెట్ ఉంటుందని చెప్పుకొచ్చారు. లాజిస్టిక్స్, ఫిన్‌టెక్, డీప్‌టెక్, అడ్వాన్స్‌డ్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్‌లో పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని అన్నారు. అమరావతిలో దేశ తొలి క్వాంటం ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అమరావతి క్వాంటం వ్యాలీలో 133 క్యూబిట్ క్వాంటం సిస్టమ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. డేటా సెంటర్ ఎకోసిస్టమ్‌తో స్టార్టప్‌లకు భారీ కంప్యూటింగ్ సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

## విజయవాడలో కాల్‌మనీ మళ్లీ విజృంభిస్తోంది

**ఎంపీ కేశినేని చిన్ని, అనుచరుడు మూల్పూరి కిషోర్ పాత్ర**

**సిఎం చంద్రబాబుకు మాజీ ఎంపి కేశినేని నాని లేఖ**

విజయవాడ,జూలై6: కాల్‌మనీ మళ్లీ రెక్కలు విప్పుతోందని, వెంటనే కళ్లెం వేయాలంటూ సీఎం చంద్రబాబుకు మాజీ ఎంపీ కేశినేని నాని బహిరంగ లేఖ రాశారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో క్రూరమైన కాల్ మనీ మాఫియా మళ్లీ విజృంభిస్తోందని.. ఈ మాఫియాలో ఎంపీ కేశినేని చిన్ని, అతని ప్రధాన అనుచరుడు మూల్పూరి కిషోర్ పాత్ర ఉందని లేఖలో ఆయన పేర్కొన్నారు. విజయవాడకు చెందిన మహిళా వ్యాపారవేత్త చాగర్ల గాయత్రీ రూ.5 కోట్లు అప్పు తీసుకుని.. అసలు-వడ్డీ కలిపి మొత్తం రూ. 21 కోట్లు పూర్తిగా తిరిగి చెల్లించింది. అయినా ఎంపీ కేశినేని చిన్ని, ఆయన ప్రధాన అనుచరుడు ముల్పూరి కిశోర్‌లు వేధిస్తున్నారు. బాపులపాడు మండలంలోని ఆమెకు చెందిన 11 ఎకరాల విలువైన భూమిని ఫోర్జరీ పత్రాలతో అక్రమంగా కబ్జా చేయడానికి అధికారులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. 2015 నాటి కాల్ మనీ వ్యవహారం తరహాలోనే సీఎం తక్షణమే ఈ అధికార గర్వంతో సాగుతున్న మాఫియా సామ్రాజ్యాన్ని ఉక్కు పాదంతో అణచివేయాలి. బాధితురాలి కుటుంబానికి, ఆమె ఆస్తికి రౌండ్-ది-క్లాక్ పోలీస్ రక్షణ కల్పించాలి. విజయవాడ పౌరుల ఆస్తులకు, ప్రాణాలకు భద్రత కల్పించే వరకు సామాన్యుల తరఫున నా ఈ పోరాటం ఆగేది లేదు' అని కేశినేని నాని లేఖలో పేర్కొన్నారు.





# శ్రీవారిని దర్శించుకున్న లెనిన్ బృందం

తిరుమల,జూలై6: లెనిన్ సినిమా విడుదల సందర్భంగా అక్కినేని నాగార్జున, అమల, అఖిల్, సునీల్, ఫిలిం ప్రొడ్యూసర్ నాగవంశీ, హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వీరికి అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండలపంలో వేదా ఆశీర్వచనం అనంతరం శ్రీవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు.

# ముగ్గురు పిల్లలున్న జంటలకు 5వేల నజరానా

**ఎపి ప్రభుత్వం కీలక ఆదేశాలు**

అమరావతి,జూలై6: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జనాభా సమతుల్యతను కాపాడటం , కుటుంబ సంక్షేమాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఒక వినూత్న నిర్ణయాన్ని తీసుకుంది. రాష్ట్రంలో ఎక్కువ సంతానాన్ని ప్రోత్సహించేలా సరికొత్త నగదు బహుమతులను, ప్రోత్సాహకాలను ప్రకటిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. దక్షిణాది రాష్ట్రాల్లో మారుతున్న జనాభా రేటు, వృద్ధుల సంఖ్య పెరుగుతుండటం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ అడుగులు వేస్తోంది. నూతన విధానం ప్రకారం? ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న కుటుంబాలను ప్రభుత్వం ప్రత్యేకంగా అభినందించనుంది. ఇందులో భాగంగా ప్రతి జిల్లాలో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు కలిగిన మూడు ఉత్తమ జంటలను ఎంపిక చేసి,



వారికి రూ. 5,000 చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేయనున్నారు. వైద్య ఆరోగ్య శాఖ సమక్షంలో ఈ ఎంపిక పక్రియ పారదర్శకంగా జరగనుంది. కేవలం సంతానాన్ని పెంచడమే కాకుండా, తల్లి మరియు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందులో భాగంగా ఒక కాన్పుకు, మరో కాన్పుకు మధ్య కనీసం రెండేళ్ల కాలం పాటు విరామం పాటించిన దంపతులకు సైతం రూ. 5,000 నగదు ప్రోత్సాహకాన్ని అందించాలని నిర్ణయించారు. ఇది తల్లుల శారీరక ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు. సరికొత్త విధానాలు , కుటుంబ నియంత్రణ/సంక్షేమ మార్పులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాల కోసం పబ్లిసిటీ బ్జడెట్ కింద రూ. 56 లక్షల నిధులను విడుదల చేసింది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రతి ఒక్కరికీ ఈ పథకాలపై స్పష్టత వచ్చేలా సమాచార శాఖ, ఆరోగ్య శాఖలు కలిసి పనిచేయను న్నాయి. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రభుత్వం ఒక ప్రత్యేక వారోత్సవాన్ని నిర్వహించనుంది. ఈ నెల 11వ తేదీ నుండి 18వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రత్యేక అవగాహన ప్రచార కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టనున్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు మరియు ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొని అర్హులైన దంపతులను గుర్తించి, ప్రభుత్వ మార్గదర్శకాలపై అవగాహన కల్పిస్తారు. ఈ ప్రతిపాదనలు భవిష్యత్తులో ఏపీ జనాభా స్థిరీకరణకు, మానవ వనరుల అభివృద్ధికి ఎంతో తోడ్పడతాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

## క్షేత్రస్థాయిలో సమస్యల పరిశీలన



**ఈవార్తలు,ఆసిఫాబాద్ టౌన్:** ఆసిఫాబాద్ పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి మున్సిపల్ యంత్రాంగం వేగంగా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా పట్టణంలోని 19వ వార్డులో విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు తాకుతుండడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, సోమవారం మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో ఆ చెట్లను తొలగించి సమస్యను పరిష్కరించారు. అదేవిధంగా, 9వ వార్డులో అంతర్గత రోడ్లు బురదమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్, కమిషనర్ అంజయ్య, కౌన్సిలర్లతో కలిసి ఆయా ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అంతర్గత రోడ్లపై బురద లేకుండా తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని మున్సిపల్ సిబ్బందికి వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సాలం బిన్ అహ్మద్, నాగు బాయ్, బీఆర్ఎస్ నాయకులు సాయి శ్రవణ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## నేడు జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం

### జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు



**ఈవార్తలు,ఆసిఫాబాద్ టౌన్ :** జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించడం జరుగుతుందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల పురోగతి శాఖల వారీగా సమీక్షించడం జరుగుతుందని, గ్రామీణ అభివృద్ధి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జల్ జీవన్ మిషన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, గ్రామ సడక్ యోజన, వ్యవసాయం, ఉద్యానవనం, విద్య, వైద్యం ఇతర శాఖల పనితీరుపై సమీక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు,, సంబంధిత శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని తెలిపారు..

## సాత్ నంబర్ గ్రామంలో నూతన బోరు ప్రారంభం



**ఈవార్తలు,నేరడిగొండ:** ఇచ్చోడ మండలంలోని సాత్ నంబర్ గ్రామ పంచాయతీ పరిధిలో నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా నూతన బోరును ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చొరవతో బోరు ఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచ్ రాథోడ్ రమేష్ నాయక్ తెలిపారు. సోమవారం నిర్వహించిన బోరు ప్రారంభోత్సవ కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తాగునీటి కోసం ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి వెంటనే స్పందించి బోరు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు తమ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తుందని, ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. నూతన బోరు ఏర్పాటు కావడంతో గ్రామంలో తాగునీటి సమస్య కొంతవరకు పరిష్కారమవుతుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, షబ్బీర్ అలీ, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి శుద్ధ జలం



**ఈవార్తలు,బెజ్జూర్:** మండలంలోని కుకుడ గ్రామపంచాయతీలో గత కొన్ని రోజులుగా పలు కాలనీలో మిషన్ భగీరథ నీళ్లు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ తొర్రెం చిరంజీవి పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రతి ఇంటికి మంచినీరు అందించాలనే ఉద్దేశంతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో గ్రామంలోని ప్రతి ఇంటికి శుద్ధ జలం అందించాలని పాలకవర్గ సభ్యులు తీర్మానం చేయడం జరిగిందన్నారు. అనంతరం గ్రామంలో మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీలను మరమ్మత్తు చేయిస్తూ ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఇందులో గ్రామపంచాయతీ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ఉన్నారు.

# క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జీలను పరిష్కరించండి

- **అధికారులకు జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశం**



**ఈవార్తలు,ఆసిఫాబాద్ టౌన్:** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులను శాఖల వారీగా, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వెంకటులు కలసి కలెక్టర్ పాల్గొని అర్జీల స్వీకరణ చేపట్టారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం ద్వారా వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, చట్ట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని, లాంగ్ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ మండలాల నుండి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. వాంకిడి మండలం తేజాపూర్ గ్రామానికి చెందిన నగారే శ్యాంరావు తనకు దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని కోరగా, తిర్యాణి మండలం అవలగూడ గ్రామానికి చెందిన బుర్క వెంకటి తనకు గతంలో వస్తున్న పింఛన్ ఆగిపోయిందని, కావున తిరిగి పునరుద్ధరించాలని దరఖాస్తు చేసుకున్నారు. భూ సమస్యలపై కూడా పలు అర్జీలు వచ్చాయి. రెబ్బెన మండలం వక్కులం గ్రామానికి చెందిన శ్రీరాముల పార్వతి తమ తండ్రి గారి పేరిట గల భూమిని ఇతరులు అక్రమంగా ఆక్రమించుకున్నందున తమకు న్యాయం చేయాలని కోరారు. కాగజ్‌నగర్ మండలం అంకుశాపూర్ గ్రామానికి చెందిన చునార్కార్ మురళీబాయి తన భూమి పట్టా సమస్యపై, అలాగే గువ్వలగుండి గ్రామానికి చెందిన గోవింద్ లాల్ తమ పట్టా భూమి కిస్తాలీ విరాళముగా పోయినందున నష్టపరిహారం ఇప్పించాలని దరఖాస్తు సమర్పించారు.మరోవైపు తిర్యాణి మండలం భింభినిగూడ గ్రామానికి చెందిన కొవ్వ పెద్ద రాజు తమ పట్టా భూమిలో ఎలాంటి ఒప్పందం లేకుండా పాఠశాల భవన నిర్మాణం చేపట్టడంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ రాంనగర్ (కాపువాడ)కు చెందిన శేఖ నాబోతుమ్మ తమ కాలనీలో గల రహదారిని ఆక్రమించి ఇల్లు నిర్మాణం చేస్తున్నందున చర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అవగాహన కల్పించడమే డీలర్ల బాధ్యత

- **డి ఏ ఓ వెంకట్**
- **రైతు వేదికలో సర్టిఫికేట్ల పంపిణీ**



**ఈవార్తలు,ఆసిఫాబాద్:** వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులను గమనిస్తూ, రైతులకు ఎరువులు, రసాయనాల వాడకంపై సరైన అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఇన్పుట్ డీలర్లపైనే ఉందని జిల్లా వ్యవసాయ అధికారి (డిఏవో) వెంకట్ పేర్కొన్నారు. 'డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ సర్వీసెస్' శిక్షణ పూర్తి చేసుకున్న ఇన్పుట్ డీలర్లకు సోమవారం జన్కాపూర్ రైతువేదికలో సర్టిఫికేట్లను అందజేశారు.మానేజ్ సమితి, తెలంగాణ ఇన్స్టిట్యూట్ వారి సంయుక్త సహకారంతో ఇన్పుట్ డీలర్లకు ఈ ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహించారు. శిక్షణ విజయవంతంగా ముగియడంతో అధికారుల ఆధ్వర్యంలో డీలర్లకు ధృవపత్రాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ శిక్షణా కాలంలో డీలర్లకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఎరువులు, పురుగు మందులను ఎంత మోతాదులో వాడాలనే శాస్త్రీయ వినియోగం, అలాగే వ్యవసాయ అనుబంధ విధానాలపై సమగ్ర సమాచారంతో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఏవో వెంకట్ మాట్లాడుతూ డీలర్లు కేవలం వ్యాపార దృక్పథంతోనే కాకుండా, రైతులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించాలని సూచించారు. శాస్త్రీయ పద్ధతులను రైతులకు వివరిస్తూ, పంట దిగుబడులు పెంచేందుకు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏడీఏ మిలింద్ కుమార్,ఏవోలు విజయ్, దీప్తి, ఫెసిలిటేటర్ సావన్ zతదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి



**ఈవార్తలు,ఆదిలాబాద్:** దేశ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని సోమవారం ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం చైర్మన్ పరమేశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా "బాబు జగజీవన్ రామ్ అమర్ రహే" అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ బాబు జగజీవన్ రామ్ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, స్వాతంత్ర భారత నిర్మాణంలోనూ విశిష్టమైన సేవలు అందించారని కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతి, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా దేశానికి అందించిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయని, ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతిఒక్కరి బాధ్యత అని అన్నారు. జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం చైర్మన్ పరమేశ్వర్ మాట్లాడుతూ బాబు జగజీవన్ రామ్ చూపిన మార్గంలో నడుస్తూ సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖీజర్ పాషా, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ గౌలి సంజయ్, రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ విభాగం జనరల్ సెక్రటరీ దుర్గం శేఖర్, జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ మంగేష్ దేవతడే, మంథని సోనియా, ఫహీం, కంట రామ్ రెడ్డి, చిట్యాల గంగన్న, మానల లింగన్నతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కల్లూరుగూడెం పామాయిల్ ఫ్యాక్టరీకి మెరుగైన అనుసంధానం

- **రైతుల విజ్ఞప్తితో స్ట్రైట్ బీటీ రోడ్డుకు గ్రీన్ సిగ్నల్**



**ఈవార్తలు,సత్తుపల్లి:** ఖమ్మం జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మాణం జరుగుతున్న తొలి పామాయిల్ ఫ్యాక్టరీ కల్లూరుగూడెంలో రూపుదిద్దుకుంటోంది. ఫ్యాక్టరీ నిర్మాణ పనులతో పాటు మెయిన్ రోడ్ నుంచి ఫ్యాక్టరీ వరకు వెళ్లే ఆర్ అండ్ బి రహదారి అభివృద్ధి పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయి. ఇటీవల ఫ్యాక్టరీ నిర్మాణ పనులను సమీక్షించిన రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో పామాయిల్ రైతులు కీలక సమస్యను ప్రస్తావించారు. ప్రస్తుతం ఫ్యాక్టరీకి వెళ్లే రహదారి వంకరలుగా ఉండటంతో భవిష్యత్తులో భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, దీంతో రహదారిని నేరుగా (స్ట్రైట్) నిర్మించాలని కోరారు. రైతుల విజ్ఞప్తిని వెంటనే పరిగణనలోకి తీసుకున్న మంత్రి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ రోడ్డుకు భూములు ఇచ్చిన రైతులతో చర్చించి, వంకరలు లేకుండా నేరుగా రహదారి నిర్మాణానికి అవసరమైన చర్యలు ప్రారంభించారు. అదేవిధంగా మెయిన్ రోడ్ నుంచి ఫ్యాక్టరీ వరకు సుమారు కిలో మీటరు మేర రహదారిని వంద అడుగుల వెడల్పుతో, మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసేలా అభివృద్ధి చేయాలని మంత్రి ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లాలోనే తొలి పామాయిల్ ఫ్యాక్టరీగా నిర్మాణం జరుగుతున్న ఈ ప్రాజెక్టు పూర్తయితే పామాయిల్ రైతులకు మార్కెటింగ్ సౌలభ్యం పెరగడంతో పాటు, స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగా పెరిగే అవకాశముందని అధికారులు పేర్కొంటున్నారు.

# కన్నకొడుకును హత్య చేసిన కసాయి తండ్రి అరెస్ట్

- **రెండు రోజుల తర్వాత పట్టుకున్న కల్లూరు పోలీసులు**



**ఈవార్తలు,సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా కల్లూరులో సంచలనం సృష్టించిన కుమారుడి హత్య కేసును పోలీసులు ఛేదించారు. కన్నకొడుకును అత్యంత దారుణంగా హత్య చేసిన తండ్రి కొత్తపల్లి సీతారాములు అలియాస్ జాన్ మార్కును సోమవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన కొత్తపల్లి సీతారాములు చెడు వ్యసనాలకు బానిసై, వివిధ నేరాలకు పాల్పడుతూ పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చినట్లు విచారణలో వెల్లడైంది. ప్రస్తుతం డబ్బుల అవసరం కారణంగా కుటుంబంతో నివసిస్తున్న ఇంటిని విక్రయించేందుకు ప్రయత్నించగా, భార్యతో పాటు కుమారుడు కిరణ్ కుమార్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో కుమారుడిని అడ్డంకిగా భావించిన సీతారాములు ముందస్తు ప్రణాళికతో ఈనెల 3న సాయంత్రం కిరణ్ కుమార్ను కల్లూరులోని ఓ బెల్ట్ షాపుకు తీసుకెళ్లి మద్యం తాగించాడు. అనంతరం ఇంటికి తీసుకువచ్చి, మద్యం మత్తులో గాఢ నిద్రలో ఉన్న సమయంలో రోకలిబండతో తలపై బలంగా కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుమారుడు మరణించాడని భావించిన నిందితుడు తన ఆటోలో అక్కడి నుంచి పరారయ్యాడు. ఘటన అనంతరం రెండు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్లోని తిరువూరు, విస్సన్నపేట ప్రాంతాల్లో తలదాచుకున్న నిందితుడు సోమవారం కల్లూరు వైపు వస్తుండగా, సమాచారం మేరకు పోలీసులు వెంకటాపురం గ్రామం వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద ఆటో, హత్యకు ఉపయోగించిన రోకలిబండ, కత్తిని స్వాధీనం చేసుకున్నారు.

# నీతి అయోగ్ లోని అంశాలపై పురోగతి సాధించాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఈవార్తలు,ఆసిఫాబాద్ :** నీతి అయోగ్ లో భాగంగా ఆకాంక్షిత జిల్లా, ఆకాంక్షిత తిర్యాని బ్లాక్ లో నిర్దేశించిన అంశాలపై పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాకజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నీతి అయోగ్ లో భాగంగా ఆకాంక్షిత జిల్లా, ఆకాంక్షిత తిర్యాని బ్లాక్ లో నిర్దేశించిన అంశాలను క్షేత్రస్థాయిలో పూర్తిచేసి పనులలో పురోగతి సాధించాలని తెలిపారు. గర్భిణీలు, చిన్నపిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించాలని, ప్రతినెల అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించాలని తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి ప్రతి నెల కిట్లను అందించి వ్యాధి నయం అయ్యేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. బరువు తక్కువగా పుట్టిన పిల్లలను గుర్తించి వైద్య సేవలు అందించాలని, మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాలలోని పిల్లలకు క్రమం తప్పకుండా శ్యామ్ మామ్ కార్యక్రమాలు నిర్వహించి బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లలతో పాటు మానసిక ఎదుగుదల లేని పిల్లలకు పోషకాహారాలు అందించాలని తెలిపారు.. ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని, పాఠశాలలలో బాలికల కోసం ప్రత్యేక మూత్రశాలల నిర్మాణాలు, త్రాగునీరు, విద్యుత్ పనులు చేపట్టాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని, పశువులకు నిర్ణీత గడువులోగా టీకాలు అందించాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణ సదుపాయం కల్పించి వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రోత్సహించాలని తెలిపారు. మారుమూల గ్రామాలలో రహదారి అనుసంధానం, త్రాగునీరు, ఇంటర్నెట్ సౌకర్యాల కల్పనపై అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, నీతి అయోగ్ జిల్లా సమన్వయకర్త బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# కులగణన పారితోషకంపై గందరగోళం..

- ఖమ్మం ప్రజావాణిలో అంగన్వాడీ టీచర్ ఫిర్యాదు



**ఈవార్తలు,సత్తుపల్లి:** కులగణన సర్వే నిర్వహించిన అంగన్వాడీ టీచర్కు చెల్లించాల్సిన పారితోషకం ప్రభుత్వ రికార్డుల్లో జమ అయినట్లు నమోదైనా, బ్యాంక్ ఖాతాలో మాత్రం నగదు జమ కాకపోవడంతో ఈ వ్యవహారం ఖమ్మం జిల్లా ప్రజావాణికి చేరింది. అధికారుల నుంచి భిన్నమైన వివరణలు రావడంతో సమస్యపై పూర్తి స్థాయి విచారణ జరిపి వెంటనే పారితోషకం చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని వేంసూరు మండలం కందుకూరు గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ దార్ల పద్మావతికి గత ఏడాది నిర్వహించిన కులగణన సర్వేకు సంబంధించి రూ.16వేల పారితోషకం ప్రభుత్వ రికార్డుల్లో చెల్లించినట్లు నమోదైనప్పటికీ, ఆమె బ్యాంకు ఖాతాలో జమ కాలేదని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ తెలిపారు. ఈ విషయమై ఈనెల 4న వేంసూరు మండల గణాంకాల అధికారి సంపత్ కుమార్ను సంప్రదించగా, తమ రికార్డుల్లో చెల్లింపు జరిగినట్లు ఉందని, బ్యాంకు ఖాతా వివరాలు కూడా సక్రమంగానే ఉన్నాయని, అయితే బ్యాంక్ స్టేట్మెంట్ ప్రకారం నగదు జమ కాలేదని గుర్తించి జిల్లా సీపీఓకు సమాచారం పంపినట్లు వివరించారు. సమస్య పరిష్కారం కోసం సోమవారం ఖమ్మం ఐడీఓసీలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పిన్నింటి రమ్య ఆధ్వర్యంలో దార్ల పద్మావతి అదనపు జిల్లా కలెక్టర్ శ్రీజకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను త్వరిత గతిన పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా సీపీఓ స్పందిస్తూ, కొందరు సిబ్బందికి సంబంధించిన పారితోషకాలు మంజూరై ప్రస్తుతం ఆర్బీఐ వద్ద సాంకేతిక కారణాలతో పెండింగ్లో ఉన్నాయని, త్వరలోనే సంబంధిత బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని హామీ ఇచ్చినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఈ విషయాన్ని ముందుగానే సంబంధిత అధికారులు స్పష్టంగా తెలియజేసి ఉంటే ప్రజావాణి వరకు వెళ్లాల్సిన అవసరం ఉండేదా అని మల్లూరు చంద్రశేఖర్ ప్రశ్నించారు. మండల గణాంకాల అధికారి "ఈ విషయమై నన్ను ఎవరూ అడగలేదు" అని చెప్పడం అధికారుల మధ్య సమన్వయ లోపాన్ని బయటపెట్టిందని విమర్శించారు. ప్రభుత్వ రికార్డుల్లో చెల్లింపు జరిగినట్లు నమోదై ఉండి, లబ్ధిదారుడి ఖాతాలో నగదు జమ కాకపోవడం, వివిధ స్థాయిల్లో అధికారులు భిన్నమైన వివరణలు ఇవ్వడం వంటి అంశాలపై సమగ్ర విచారణ జరిపి, అర్హులైన వారందరికీ పెండింగ్ పారితోషకాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

# జంతువుల ఆరోగ్యం.. మన ఆరోగ్యం

- ఘనంగా ప్రపంచ జూనోసిస్ దినోత్సవం

**ఈవార్తలు,నేరడిగొండ:** ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నేరడిగొండ మండల కేంద్రంలోని పశువైద్యశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై పశువైద్యాధికారి డాక్టర్ జీవన్ రాథోడ్ ప్రజలకు అవగాహన కల్పించారు. "ఒక్క ఆరోగ్యం.. ఒకే లక్ష్యం" అనే నినాదంతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జంతువులను ఆరోగ్యంగా ఉంచడం ద్వారానే కుటుంబ, సామాజిక ఆరోగ్యాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులను జూనోసిస్గా పిలుస్తారని, ఇవి కుటుంబాలతో పాటు సమాజం, ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు. జంతువులతో నేరుగా సంబంధం కలిగి ఉండటం, కలుషితమైన మాంసాహారం తీసుకోవడం, పాశ్చరైజ్ చేయని పాలు, పాల ఉత్పత్తులను వినియోగించడం, కలుషితమైన మట్టి, నీరు, పరిసరాల ద్వారా, కీటకాలు, దోమల ద్వారా ఈ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని వివరించారు. జూనోసిస్ వ్యాధుల నివారణకు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం అత్యంత ముఖ్యమని సూచించారు. చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవడం, పాశ్చరైజ్ చేసిన పాలు, పాల ఉత్పత్తులను మాత్రమే వినియోగించడం, మాంసం, గుడ్లను బాగా ఉడికించి తీసుకోవడం, పెంపుడు జంతువులు, పశువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించడం, అనారోగ్యంతో ఉన్న జంతువులను వెంటనే వేరు చేసి పశువైద్యులను సంప్రదించడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి తావులేదు

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఈవార్తలు,ఆదిలాబాద్:** ప్రజావాణి ద్వారా అందుతున్న ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం, నిర్లక్ష్యాన్ని సహించబోమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. ప్రజావాణి పోర్టల్లో నమోదయ్యే ప్రతి అర్జీని నిర్దేశిత గడువులోగా పరిష్కరించడం సంబంధిత అధికారుల ప్రథమ బాధ్యత అని పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సామాజిక భద్రతా పెన్షన్లు, ఉపాధిహామీ పథకం, భూభారతి తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 94 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ప్రతి అర్జీపై సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి, పరస్పర సమన్వయంతో సమస్యలకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును 30 రోజుల్లోగా పరిష్కరించాలని, మండల స్థాయిలో ఎంపీడీఓలు, తహశీల్దార్లు, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి, తీసుకున్న చర్యల వివరాలను సకాలంలో ప్రజావాణి పోర్టల్లో నమోదు చేయాలని సూచించారు. ఒకే సమస్యపై పదేపదే ఫిర్యాదులు రాకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలని, అప్పీల్ కేసులను రెండు నుంచి మూడు రోజుల్లోనే పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్ఎస్. చిత్రు, డీఆర్ఓ స్రవంతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పెంపుడు జంతువులకు తప్పనిసరిగా రేబిస్ టీకాలు వేయించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**ఈవార్తలు,మంచిర్యాల:** పెంపుడు కుక్కలు, జంతువులకు తప్పనిసరిగా రేబిస్ టీకాలు వేయించడం ద్వారా ప్రమాదకరమైన వ్యాధులను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మంచిర్యాల పట్టణంలోని ప్రాథమిక పశువైద్య కేంద్రంలో నిర్వహించిన ఉచిత రేబిస్ టీకాల కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ యాకూబ్, డివిజన్ కార్పొరేటర్ సుదమల్ల హరికృష్ణతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు జూనోటిక్ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉన్నందున రైతులు, పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జంతువులకు సకాలంలో టీకాలు వేయించడం, అనారోగ్యంతో ఉన్న జంతువులను వేరుగా ఉంచడం, పాలు, మాంసాన్ని పరిశుభ్రంగా నిర్వహించడం, తదితర జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా 32 పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి శాంతిరేఖ, లైవ్స్టాక్ అసిస్టెంట్ సోనియా, సహాయకులు గోవర్ధన్, గోపాలమిత్ర వేణు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




# ఈనెల 14న మెగా జాబ్ మేళా

**మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనుషా**




**ఈవార్తలు,ఆదిలాబాద్:** నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈనెల 14న ఆదిలాబాద్లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనుషా సతీష్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని ఎస్టీయూ భవన్లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ జాబ్ మేళా ద్వారా ఆదిలాబాద్ స్పిన్నింగ్ మిల్లో ఖాళీగా ఉన్న వివిధ విభాగాల పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. స్థానిక యువత తమ జిల్లాలోనే ఉద్యోగాలు పొందేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు తమ విద్యార్హత ధ్రువ పత్రాలతో జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు జాబ్మేళాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో స్పిన్నింగ్ మిల్ మేనేజర్, స్టెప్ మాజీ సీఈఓ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం



**ఈవార్తలు,ఆదిలాబాద్:** భారత మాజీ ఉప ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమర యోధుడు, సామాజిక న్యాయ సాధకుడు బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ చౌక్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనుషా సతీష్, ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ ఉన్నత విలువలు కలిగిన రాజకీయ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప విద్యావేత్త, సామాజిక సమానత్వం కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, సమాన అవకాశాలు, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి నేటికీ ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న ఆయన స్వాతంత్ర భారత దేశంలో వ్యవసాయం, కార్మిక, రక్షణ వంటి కీలక మంత్రిత్వ శాఖలను సమర్ధవంతంగా నిర్వహించి దేశాభివృద్ధికి విశేషంగా దోహదపడ్డారని చెప్పారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలను ఆచరణలో పెట్టి సమానత్వ సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సామాజిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నర్సాపూర్లో సీసీ రోడ్డుకు భూమిపూజ



**ఈవార్తలు,తాండూర్:** మండలంలోని నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల రెండో వార్డులో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ ప్రభాత్ రావు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద రూ.5లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రజల రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారడంతో పాటు స్థానికులకు ఇబ్బందులు తొలగుతాయని పేర్కొన్నారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన పనులను దశల వారీగా చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ పర్వత్ రావు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి నాలుగు గుంటల భూమి అప్పగింత



**ఈవార్తలు,హన్మకొండ:** దామెర మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి నాలుగు గుంటల భూమిని సోమవారం రెవెన్యూ అధికారుల సమక్షంలో వైద్య ఆరోగ్య శాఖకు అధికారికంగా అప్పగించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ భూమిని కేటాయించినట్లు స్థానిక ప్రజాప్రతినిధులు తెలిపారు. ఆరోగ్య కేంద్రం నిర్మాణం పూర్తయిన తర్వాత మండల ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ కృపావతి, దామెర గ్రామ సర్పంచ్ కల్పనా కృష్ణమూర్తి, ఉప సర్పంచ్ బత్తిని రాజు యాదవ్, వార్డు సభ్యులు మీరాల రజిత రవి, మంతూర్తి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# గబ్బాయి ప్రధాన రహదారిపై బురద తొలగింపు



**ఈవార్తలు,బెజ్జూర్:** ఇటీవల కురిసిన వర్షాలతో బెజ్జూర్ మండలంలోని గబ్బాయి గ్రామ ప్రధాన రహదారిపై మట్టి పేరుకుపోయి బురదగా మారడంతో వాహన దారులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను గుర్తించిన గ్రామ పంచాయతీ పాలకవర్గం వెంటనే స్పందించి రహదారిపై పేరుకుపోయిన బురదను తొలగించేలా చర్యలు చేపట్టారు. గ్రామ సర్పంచ్ వడ్డేపల్లి లావణ్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు సమావేశమై ప్రధాన రహదారిని వెంటనే శుభ్రం చేయాలని నిర్ణయించారు. సోమవారం జేసీబీ సహాయంతో రహదారిపై పేరుకు పోయిన మట్టి, బురదను తొలగించి వాహనాల రాకపోకలకు అనుకూలంగా మార్చారు. గ్రామంలో ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించేందుకు పాలకవర్గం కృషి చేస్తోందని స్థానిక నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కృష్ణపల్లి ఉప సర్పంచ్ ఎలాది సుకారాం, పాపన్నపేట్ ఉప సర్పంచ్ దన్నూరి శ్రీకాంత్, నాయకులు తుమ్మిడే క్రాంతి కిరణ్, ఆత్రం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఈవార్తలు,మంచిర్యాల:** ప్రజావాణిలో అందుతున్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములతో కలిసి ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 79 దరఖాస్తులు అందాయని, ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రధాన రహదారిపై మట్టి తొలగింపు



**ఈవార్తలు,బెజ్జూర్:** వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా బెజ్జూర్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై పేరుకుపోయిన మట్టిని సోమవారం తొలగించారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి బెజ్జూర్ తీగల ఒర్రె బ్రిడ్జి వరకు రహదారికి ఇరువైపులా ఉన్న మట్టిని ట్రాక్టర్ సహాయంతో తొలగించినట్లు గ్రామ సర్పంచ్ దుర్గం సరోజా తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షాల కారణంగా రహదారికి ఇరువైపులా మట్టి బురదగా మారి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టామని చెప్పారు. ప్రధాన రహదారితో పాటు గ్రామంలోని పలు వార్డుల్లోనూ రోడ్లపై పేరుకుపోయిన మట్టిని తొలగించినట్లు తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి వైకుంఠం మాట్లాడుతూ పశువులను విచ్చలవిడిగా రహదారులపై వదిలేయవద్దని యజమానులకు సూచించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో పంట పొలాల్లోకి పశువులు వెళ్లి రైతులకు నష్టం కలిగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. యజమానులు తమ పశువులను అదుపులో ఉంచుకోకపోతే రైతులు వాటిని బంజర దొడ్డికి తరలించే అవకాశం ఉందని, అలాంటి పరిస్థితుల్లో పంచాయతీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# భగీరథ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించండి

**జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా**




**ఈవార్తలు,ఆసిఫాబాద్ టౌన్:** మిషన్ భగీరథ కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులకు గత మూడు నెలలుగా నిలిచి పోయిన వేతనాలను వెంటనే విడుదల చేయాలని, ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్ యువరాజు మర్మాట్కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భోగి ఉపేందర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్ సెగ్మెంట్లో పనిచేస్తున్న మిషన్ భగీరథ కార్మికులకు గత కొన్ని నెలలుగా వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాల చెల్లింపు విషయమై కాంట్రాక్ట్ సంస్థలైన ఎల్ అండ్ టీ ఎవరెస్ట్, ఇతర ఏజెన్సీల చుట్టూ తిరిగినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని, యాజమాన్యాలు కాలయాపన చేస్తు న్నాయని మండిపడ్డారు. మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కార్మికులు కుటుంబాలను పోషించలేక, తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని పేర్కొ న్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.26 రోజుల పని విధానంతో పాటు రోజుకు 8 గంటల పని విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని, ముఖ్యమంత్రి ప్రకటించిన కనీస వేతనాలను భగీరథ కార్మికులకు కూడా వర్తింపజేయాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని, ప్రమాద బీమా, ఎక్స్-గ్రేషియా, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ, ఈఎస్ఐ, ఈపీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు వారాం తపు సెలవులు, జాతీయ పండుగ సెలవులు మంజూరు చేయాలని, 20 శాతం బోనస్ లేదా ఒక నెల జీతాన్ని అదనంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆత్మకూరి చిరంజీవి, జిల్లా అధ్యక్షుడు చాపిడి బాలేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.కె. జంషద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కె. షకీర్ పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణలో డిజిటైజేషన్ వేగవంతం చేయాలి





- **రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**ఈవార్తలు,మంచిర్యాల:** రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్ఓలు), సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఏఈఆర్ఓలు)తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 25 నుంచి ప్రారంభమైన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ తుది దశకు చేరుకుందని తెలిపారు. పంపిణీ చేసిన ఫారాలను ఓటర్ల నుంచి తిరిగి సేకరించి, అందులోని వివరాలను సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) బీఎల్ఓ యాప్లో నమోదు చేయాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాల పూరణలో వాలంటీర్ల సహాయాన్ని వినియోగించు కోవాలని, డిజిటైజేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జూలై 20 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ చేపట్టి, ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1,200 మందికి మించి ఓటర్లు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో తప్పుడు సమాచారం సమర్పించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిజిటైజేషన్ ప్రక్రియలో బీఎల్ఓలకు సూపర్వైజర్లు, వాలంటీర్లు సహకారం అందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 99 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి కాగా, 6.8 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని తెలిపారు. వచ్చే సోమవారం నాటికి 50 శాతం డిజిటైజేషన్ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ను పకడ్బందీగా నిర్వహిస్తామని, బీఎల్ఓలు, బూత్ స్థాయి ఏజెంట్లతో నిరంతరం సమావేశాలు నిర్వహిస్తూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుం టున్నామని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- **ఇచ్చోడలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం**



**ఈవార్తలు,ఇచ్చోడ:** రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేసిన సందర్భంగా సోమవారం ఇచ్చోడ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. జిల్లా అధికార ప్రతినిధి కుంరం కోటేశ్వర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రప టానికి పాలాభిషేకం చేసి, మిఠాయిలు పంచి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. రైతు భరోసా పథకం ద్వారా రైతుల వ్యవసాయ పెట్టుబడి భారం కొంతవరకు తగ్గుతుందని, రైతు కుటుంబాల ఆర్థికాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయా భివృద్ధి, రైతు సంక్షేమానికి కట్టుబడి పని చేస్తోందని చెప్పారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కళ్లెం నారాయణరెడ్డి మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం దశల వారీగా అమలు చేస్తోందని, రైతు సంక్షేమ కార్య క్రమాలను గ్రామస్థాయికి తీసుకె ళ్లేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముకుర్ సర్పంచ్ జైపాల్, దుబార్పేట్ సర్పంచ్ విఠల్, కామగిరి సర్పంచ్ సుధాకర్ రెడ్డి, సిరిచెల్మ సర్పంచ్ కాల రవి, మార్కాపూర్ సర్పంచ్ సులోచన భీమ్రావు, బోథ్ నియో జకవర్గ మైనార్టీ చైర్మన్ ముస్తఫా, ఎస్సీ సెల్ చైర్మన్ కొత్తూరు లక్ష్మణ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఆత్రం గంగారాం, ఏఎంసీ డైరెక్టర్లు బైర్ లచ్చన్న, రాథోడ్ దుదిరాం, ఆత్మ డైరెక్టర్ గౌస్ ఉద్దీన్, ఉప సర్పంచ్ అజీం, మాజీ ఉప సర్పంచ్ షేక్ మహబూబ్, మండల మైనార్టీ చైర్మన్ అబ్దుల్ రషీద్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు



**ఈవార్తలు,హన్మకొండ:** భారతీయ జనసంఘ్ వ్యవస్థా పకులు, మహోన్నత దేశభక్తుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి వేడుకలను సోమవారం హన్మకొండ జిల్లా దామెర మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్చార్జి డాక్టర్ పెసరు విజయ్చందర్ రెడ్డి మాట్లాడుతూ ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, ఇద్దరు ప్రధానులు ఉండకూడదనే నినాదంతో దేశ సమైక్యత కోసం ఉద్యమించిన మహనీయుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. దేశ సమగ్రత, జాతీయ ఐక్యత కోసం ఆయన చేసిన త్యాగాలు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ప్రతి బీజేపీ కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని, దేశభక్తి, జాతీయవాద భావాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు గురిజాల శ్రీరామ్ రెడ్డి, పరకాల నియోజకవర్గ కోకన్వీనర్ మాదారపు రతన్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి సూర్యచందర్, సర్పంచ్ చుక్క వనిత మహేందర్, మండల ఉపాధ్య క్షురాలు పాలకుర్తి శ్రీలత, కార్యదర్శులు మీరు శ్రీనివాస్, కొట్టే రాజు, జిల్లా నాయకులు వేల్పుల సుధాకర్, మండల నాయకులు గన్ను సతీష్, బిల్లా రమణారెడ్డి, కొడారి రాజు, పెంట రమేష్, గువ్వ సాంబయ్య, మాదారపు సాంబయ్య, కన్కె కొమురయ్య, నూకల రాజయ్య, బూత్ అధ్యక్షులు కొత్తపెల్లి శివ, నీరేటి రాజేందర్, అన్నెబోయిన రోహిత్తో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెంపుడు జంతువులకు రేబిస్ టీకాలు



**ఈవార్తలు,వాంకిడి:** ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్క రించుకుని సోమవారం వాంకిడి మండల కేంద్రంలోని ప్రాథమిక పశువైద్యశాలలో పెంపుడు జంతువులకు ఉచితంగా రేబిస్ నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే జూనోసిస్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. వెటర్నరీ సహాయ సంచాలకులు మడావి వినోద్ మాట్లాడుతూ రేబిస్తో పాటు బర్డ్ ఫ్లూ వంటి జంతువుల నుంచి వ్యాపించే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెంపుడు జంతువులకు సకాలంలో టీకాలు వేయించడం, పరిశుభ్రత పాటించడం ద్వారా ఈ వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. పెంపుడు కుక్కలు, ఇతర జంతువులకు క్రమం తప్పకుండా రేబిస్ టీకాలు వేయించాలని, జంతువుల్లో అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే పశువైద్యులను సంప్రదిం చాలని సూచించారు.

# కార్యకర్తలే పార్టీకి బలం

• ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



**ఈవార్తలు,సత్తుపల్లి:** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి కార్యకర్తలే ప్రధాన బలమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామంలో సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా బుగ్గపాడు, రుద్రాక్షపల్లి గ్రామాల నూతన కాంగ్రెస్ కమిటీలను ప్రకటించి సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హత గల ప్రతి కుటుంబానికి చేరేలా గ్రామ కమిటీలు చొరవ తీసుకోవాలని సూచించారు. ప్రజలతో నిరంతరం మమేకమై పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ బుగ్గపాడు ఫుడ్ పార్కులో స్థానిక యువతకు టెక్నికల్, నాన్-టెక్నికల్ ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామంలోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుగ్గపాడు, రుద్రాక్షపల్లి గ్రామాల అభివృద్ధి, స్థానిక సమస్యలపై నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా చర్చించారు. సమావేశానికి పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, కాంగ్రెస్ శ్రేణులు హాజరై మట్టా దంపతులకు ఘన స్వాగతం పలికారు. పలువురు మహిళలు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో లబ్ధి పొందుతున్నామని, వాటిపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, బుగ్గపాడు కాంగ్రెస్ అధ్యక్షుడు పర్స రాఘవరావు, రుద్రాక్షపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు పిన్నమనేని దామోదర్రావు, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి హలవత్ అర్జున్, సర్పంచ్ పాయం నాగేంద్రబాబు, ఉప సర్పంచ్ భూపతిరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు

# ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**ఈవార్తలు,తాండూర్:** రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుచ్చ మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం తాండూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించిన 2026 సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానం అమలు చేసేలా ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్ కార్డుల సేవలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని, పెండింగ్లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పీఆర్సీ కమిషన్ నివేదికను త్వరగా స్వీకరించి, కనీసం 50 శాతం ఫిట్మెంట్తో కొత్త పీఆర్సీని ప్రకటించాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను విడుదల చేసేందుకు రూ.2వేల కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కేజీబీవీ పాఠశాలల్లో ఎంటీఎస్, కేర్టేకర్, వార్డెన్ పోస్టులను మంజూరు చేసి అక్కడి సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా జెడ్పీఎస్ఎస్ తాండూర్, అచలాపూర్, రేచిని పాఠశాలలతో పాటు కేజీబీవీ




పాఠశాలల ఉపాధ్యాయులకు సభ్యత్వం కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆనంద్, ప్రధాన కార్యదర్శులు మధుసూదన్, శ్రీకాంత్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గడువులోగా ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ పూర్తి చేయాలి

• రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి




**ఈవార్తలు,ఆదిలాబాద్:** రాష్ట్రంలో ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, డేటా డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం బీఎల్ఓలు మాత్రమే ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఇతర వ్యక్తులు ఫారాలు పంపిణీ చేయడానికి అధికారం లేదని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని, ప్రజల సందేహాల నివృత్తి కోసం అదనపు హెల్ప్డెస్క్లను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ ఇప్పటికే విజయవంతంగా పూర్తయిందని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని, ఫారాల డిజిటలైజేషన్ను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని చెప్పారు. అలాగే జిల్లాలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిరంతరం సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ చిత్రు, డీఆర్ఓ స్రవంతి, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, జిల్లా ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# గ్రామ ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం





• వీఓ భవన నిర్మాణానికి భూమిపూజ

**ఈవార్తలు,జైనూర్:** గ్రామ ప్రజలకు మెరుగైన సేవలే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్ తొడసం రాజేందర్ అన్నారు. మండలంలోని పవర్గూడా గ్రామపంచాయతీలో విఓ భవన నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ప్రభుత్వ సేవలు ఒకేచోట సులభంగా అందుబాటులో ఉండేలా ఆధునిక సౌకర్యాలతో విఓ భవనాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. గ్రామాభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, రహదారులు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను గ్రామంలోనే అందించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజల సహకారంతో పవర్గూడాను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని అన్నారు. విఓ భవనం నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రభుత్వ ధ్రువపత్రాలు, సంక్షేమ పథకాల సేవలు, ఇతర పరిపాలనా కార్యక్రమాలు గ్రామ ప్రజలకు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రతి ఓటరు వివరాలు నమోదు చేయాలి

**ఈవార్తలు,సిరికొండ:** ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని, అర్హులైన ప్రతిఒక్కరూ తమ వివరాలను సక్రమంగా నమోదు చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంచం లక్ష్మణ్ అన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం సిరికొండ మండలంలోని కొండాపూర్ గ్రామ పంచాయతీలో ఓటర్ల ఎన్యూమరేషన్ ప్రక్రియను పరిశీలించారు. గ్రామపంచాయతీ పరిధిలోని 9వ పోలింగ్ బూత్లో బీఎల్ఓతో కలిసి బీఎల్ఏ బొబ్బిలి బాలాజీ ఆధ్వర్యంలో ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ఫారాలను ఎలా పూరించాలి, వ్యక్తిగత వివరాలను ఏ విధంగా నమోదు చేయాలనే అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఓటు ఎంతో విలువైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పట్టేపు లక్ష్మణ్, ఉప సర్పంచ్ బాదు పటేల్, వార్డు సభ్యుడు గుగ్గిళ్ల సాయి, బట్టి రాజు, హన్మాండ్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## లింగాపూర్ రోడ్డుకు రెడ్ గ్రావెల్



**ఈవార్తలు,గుడిహత్నూర్:** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని గుడిహత్నూర్ సర్పంచ్ ఆడే శీల అన్నారు. సోమవారం లింగాపూర్ రోడ్డుపై రెడ్ గ్రావెల్ పనులను ప్రారంభించడంతో పాటు మహంకాళి గల్లీలో వర్షపు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. లింగాపూర్ రోడ్డుపై ఏర్పడిన గుంతలను ముందుగా మొరంతో పూడ్చి తాత్కాలికంగా రాకపోకలకు అనుకూలంగా మార్చారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రోడ్డుపై మళ్లీ బురద, లొందలు ఏర్పడటంతో వర్షాలు కాస్త తగిన వెంటనే పనులను పర్యవేక్షిస్తూ రెడ్ గ్రావెల్ వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే మహంకాళి గల్లీలో ప్రతి వర్షానికీ వరద నీరు రోడ్డుపై ప్రవహించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో డోజర్ సహాయంతో చెత్తాచెదారాన్ని తొలగించేలా చర్యలు చేపట్టారు. దీంతో వరద నీరు నిల్వ ఉండకుండా పరిష్కారం లభించింది. ప్రజా సమస్యలపై వెంటనే స్పందిస్తూ అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడుతున్న సర్పంచ్ ను గ్రామ ప్రజలు అభినందిస్తున్నారు.

# అనుమతి లేని ఫ్లెక్సీలపై ఉక్కుపాదం

## 18 మందిపై కేసులు: ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి




**ఈవార్తలు,ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పట్టణంలోని జగ్జీవన్ చౌక్ వద్ద అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన 18 మందిపై వన్టౌన్ పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే విధంగా జిల్లా పోలీస్, మున్సిపల్ శాఖల ఆదేశాలను ఉల్లంఘించినందున ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసులో రాజు, రోహిత్ షిండే, మహంకాళి అజయ్, యానం నర్సింగరావు, ఫిరంగి మల్లేష్, సోమ ప్రశాంత్, భూపేందర్, రాజు, శ్రీకాంత్ రెడ్డి, సురేందర్, నరేష్, శరత్, గణేష్, శ్రీను, ఇంతియాజ్లతో పాటు ఫ్లెక్సీలను ముద్రించిన వాసవి ఫ్లెక్స్ యజమాని నాగరాజ్, ఎస్ఆర్డీ ఫ్లెక్స్ యజమాని, సునీల్ ఫ్లెక్స్ యజమాని సునీల్లపై కూడా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఫ్లెక్సీల కారణంగా రహదారులపై విజిబిలిటీ తగ్గి ట్రాఫిక్ సంకేతాలు కనిపించకుండా ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని వివరించారు. ఫ్లెక్సీలతో ఏదైనా ప్రమాదం సంభవిస్తే సంబంధిత నిర్వాహకులతో పాటు వాటిని తయారు చేసిన ఫ్లెక్స్ షాపుల యజమానులను కూడా కేసుల్లో నిందితులుగా చేర్చుతామని స్పష్టం చేశారు. ఇకపై అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే వారిపై, వాటిని తయారు చేసే ప్రింటింగ్ నిర్వాహకులపై కూడా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పని హెచ్చరించారు.

# విద్యార్థుల భద్రతకు పెద్దపీట

• ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

• గిరిజన గురుకుల కళాశాలకు కంపౌండ్ వాల్ నిర్మాణానికి భూమిపూజ




**ఈవార్తలు,జైనూర్:** విద్యార్థుల భద్రతకు పెద్దపీట వేస్తున్నామని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జైనూర్ మండలం బుసిమెట్టలోని గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో కంపౌండ్ వాల్ నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల విద్యతో పాటు వారి భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కళాశాలకు ఇప్పటివరకు కంపౌండ్ వాల్ లేకపోవడంతో విద్యార్థుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోందని, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు కంపౌండ్ వాల్ నిర్మాణానికి మంజూరు కల్పించినట్లు తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన గురుకుల విద్యా సంస్థల్లో గిరిజన విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసిస్తున్నారని, మౌలిక సదుపాయాల కల్పనకు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కూడ్మేత విశ్వనాథ్ రావు, స్థానిక సర్పంచ్ ఆత్రం సింధు నగేష్, కళాశాల ప్రిన్సిపల్, లెక్చరర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఒయ్యారి చిత్రం


నాగదుర్గ



# డ్రాగన్ మూవీలో పవర్‌ఫుల్ రోల్‌లో ఎన్టీఆర్

## ఫ్యాన్స్ కోసం భారీ యాక్షన్ ఎపిసోడ్ ప్లాన్

యంగ్ టైగర్ ఎన్టీఆర్ , సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో తెరకెక్కుతున్న హై–వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన్'. ఈ మోస్ట్ అవైటెడ్ కాంబినేషన్ కోసం నందమూరి అభిమానులతో పాటు యావత్ సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా, వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ప్రశాంత్ నీల్ మార్క్ ఎలివేషన్స్, ఎన్టీఆర్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ కలబోసి వస్తున్న ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, ఈ సినిమా అప్‌డేట్స్ కోసం వేచి చూస్తున్న ఫ్యాన్స్‌కు దర్శకుడు ప్రశాంత్ నీల్ ఒక అదిరిపోయే యాక్షన్ ఎపిసోడ్‌ను ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో వచ్చే ఇంటర్వెల్ బ్లాక్ యాక్షన్ సీన్స్ ప్రేక్షకులను థియేటర్లలో



సీట్ల నుంచి లేచి నిలబడేలా చేస్తాయని సమాచారం. అభిమానుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా, వారిని పూర్తిగా దృష్టిలో పెట్టుకుని ప్రశాంత్ నీల్ ఈ భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా డిజైన్ చేశారట. ఈ ఇంటర్వెల్ ÷ట్‌లో తారక్ విధ్వంసక నటన, సరికొత్త యాక్షన్ స్టంట్స్ నెక్ట్స్ లెవెల్‌లో ఉండబోతున్నాయని టాక్. గతంలో ప్రశాంత్ నీల్ సినిమాల్లోని ఇంటర్వెల్ సీన్స్ ఎంతటి సంచలనం సృష్టించాయో అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఎన్టీఆర్‌తో అంతకుమించిన భారీ యాక్షన్ విందును ఆయన సిద్ధం చేస్తున్నట్లు వినికిడి. ఇక ఇటీవల విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ వీడియో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ గ్లింప్స్‌లో కథలోని అనేక కీలక పాత్రలను ప్రశాంత్ నీల్ పరిచయం చేసినప్పటికీ, అసలు కథకు మూలమైన మెయిన్ కాన్‌ఫ్లిక్ట్‌ను మాత్రం రివీల్ చేయకుండా చాలా సస్పెన్స్‌గా ఉంచారు. ఈ మెయిన్ కాన్‌ఫ్లిక్ట్ చుట్టూ తిరిగే కథాంశంలోనే హీరోయిన్ కృతి సనన్ క్యారెక్టర్ కూడా ఎంట్రీ ఇస్తుందని తెలుస్తోంది. కథను మలుపు తిప్పే అత్యంత కీలకమైన ట్రాక్‌లో ఆమె పాత్ర కనిపించబోతుండటంతో, సినిమాలో కృతి సనన్ పాత్ర ప్రాధాన్యతపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సాధారణంగా ప్రశాంత్ నీల్ సినిమా అనగానే అందరికీ ఫుల్ బ్లాక్ అండ్ గ్రే షేడ్ ఫ్రేమ్స్, డార్క్ థీమ్స్ మాత్రమే ఎక్కువగా గుర్తుకొస్తాయి. కానీ ఎన్టీఆర్ 'డ్రాగన్' విషయంలో ఆయన తన రూట్ మార్చినట్లు తెలుస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఈ క్రేజీ చిత్రాన్ని వచ్చే ఏడాది జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు.

# నిర్మాతగా ప్రదీప్ రంగనాథ్ కొత్త అవతారం

వరుస విజయాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న తమిళ యువ నటుడు, దర్శకుడు ప్రదీప్ రంగనాథ్ ఇప్పుడు నిర్మాతగా అవతారం ఎత్తబోతున్నారు. లవ్ టుడే, డ్రాగన్ వంటి చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఆయన, ఇటీవల విడుదలైన సినిమాతో మాత్రం ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయారు. ఈ సినిమా నిరాశపరిచినప్పటికీ ప్రదీప్ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా కొత్త ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే నటుడు, దర్శకుడు, కథా రచయిత, గేయ రచయితగా తన ప్రతిభను చాటుకున్న ప్రదీప్ రంగనాథన్.. ఇప్పుడు నిర్మాతగానూ అడుగుపెడుతున్నారు. తాజాగా పీఆర్ షో అనే సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించిన ఆయన, ఆ బ్యానర్‌పై తొలి చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రంలో 'ప్రేమలు', 'డ్యూడ్' చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న మమిత బైజు కథానాయికగా నటిస్తోంది. దర్శకుడిగా పేరు తెచ్చుకుని, ప్రస్తుతం నటుడిగానూ రాణిస్తున్న అశ్వత్ మారిముత్తు కీలక పాత్ర పోషిస్తున్నారు. అలాగే ఈ సినిమాతో అనామిక మహి వెండితెరకు పరిచయం కానుండగా, తెలుగు నటుడు శివాజీ సొంటినేని, నటి స్వాసిక ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి మరో ప్రత్యేక ఆకర్షణ 'ది ఆల్ఫా యూనిట్'. ఆరుగురు యువ దర్శకులతో ఫిల్మ్‌మేకింగ్ చేయడం. విశాల్ టీఆర్, యశ్ వి, నరేన్ సౌదా, చాణక్యన్ ఆర్, ధనుష్ కుమార్, ఇళంపరితి ఈ సినిమాకు సంయుక్తంగా దర్శకత్వం వహించనున్నారు. ఈ వినూత్న ప్రయత్నం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రానికి కథను స్వయంగా ప్రదీప్ రంగనాథన్ అందించగా, యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ సంగీతం సమకూరుస్తున్నారు. సినిమా ప్రకటన సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియో ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. ఇందులో నటీనటులు, సాంకేతిక బృందాన్ని పరిచయం చేస్తూ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశారు. నిర్మాతగా ప్రదీప్ రంగనాథన్ ప్రారంభిస్తున్న ఈ కొత్త ప్రయాణం ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.



# నాగార్జున వందో సినిమాలో టబు



టాలీవుడ్ కింగ్ నాగార్జున కెరీర్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కనున్న 100వ సినిమాపై అభిమానుల్లో రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. ఇటీవల అక్కినేని అఖిల్ నటించిన 'లెనిన్' ప్రీ–రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న నాగార్జున, తన మైలురాయి చిత్రం కింగ్100 కు సంబంధించిన అధికారిక అప్‌డేట్‌ను జూలై 10 తర్వాత వెల్లడిస్తానని ప్రకటించారు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై సోషల్ మీడియాలో చర్చలు మరింత వేగం పుంజుకున్నాయి. ఇప్పటివరకు చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రాకపోయినా, ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న తాజా వార్తలు అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని పెంచుతున్నాయి. ముఖ్యంగా ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ టబూ కీలక పాత్రలో కనిపించనున్నట్లు, అంతేకాదు ఆమె ఈసారి నెగెటివ్ షేడ్స్ ఉన్న ప్రధాన ప్రతినాయక పాత్రను పోషించే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. గతంలో నాగార్జున, టబూ కలిసి నటించిన సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వారి ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీకి ప్రత్యేక అభిమానులు ఉన్నారు. అందుకే ఈసారి కూడా ఇద్దరూ జంటగా కనిపిస్తారని చాలామంది భావించారు. అయితే తాజా ప్రచారం ప్రకారం, టబూ ఈ చిత్రంలో హీరోయిన్‌గా కాకుండా నాగార్జునకు ఎదురుగా నిలిచే ప్రధాన ప్రతినాయకురాలి పాత్రలో నటించనున్నట్లు సమాచారం. ఈ వార్త నిజమైతే, ఇద్దరూ తొలిసారి పూర్తిగా భిన్నమైన పాత్రల్లో తలపడే అవకాశం ఉంటుంది. తండ్రి–కూతురు మధ్య సాగే భావోద్వేగ కథ ఈ సినిమాకు ప్రధాన బలంగా ఉండనుందని టాక్. ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తుండగా, యువ నటి సుష్మిత భట్ కీలక పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది.





# ఇరుముడితో బిజీ.. అయినా కొత్త సినిమాపై దృష్టి

## శ్రీవిష్ణుతో కలసి మల్టీస్టారర్ కోసం రవితేజ యత్నం

మాస్ మహారాజా రవితేజ వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారు. ఈ ఏడాది సంక్రాంతికి ప్రేక్షకులను అలరించిన ఆయన, ఇప్పుడు మరోసారి బిజీ షెడ్యూల్‌తో అభిమానులకు వరుస సినిమాలను అందించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం నటిస్తున్న ఆధ్యాత్మిక యాక్షన్ డ్రామా 'ఇరుముడి' చివరి దశ షూటింగ్‌లో ఉండగానే, మరో కొత్త ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగు తోంది. తాజా సమాచారం ప్రకారం, 'రాజా రాజా చోర' ఫేమ్ దర్శకుడు హసిత్ గోలి దర్శకత్వంలో రవితేజ ఓ వినోదాత్మక చిత్రంలో నటించనున్నారని తెలుస్తోంది. ఈ సినిమాలో టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు కూడా కీలక పాత్రలో కనిపించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. హసిత్ గోలి శైలికి తగ్గట్టుగా హాస్యం, వినూత్న కథనం ప్రధాన బలాలుగా ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు సమాచారం. ఈ నెలలో పూజా కార్యక్రమాలతో సినిమాను ప్రారంభించి, వచ్చే నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారట.

# 10న విడుదలవుతున్న లెనిన్

## ఓటిటి హక్కులు దక్కించుకున్న జీ




చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న యాక్టర్లలో ఒకడు టాలీవుడ్ నటుడు అక్కినేని అఖిల్. ఈ సారి ఎలాగైనా హిట్టు కొట్టాలని మేకోవర్ మార్చుకుని లాంగ్ గ్యాప్ తర్వాత 'లెనిన్'గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు అఖిల్. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీ జులై 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చిత్రయూనిట్ చెప్పిన మాటలు లెనిన్ గ్రాండ్ సక్సెస్ అవడం పక్కా అని ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నట్టు చెప్పకనే చెబుతున్నాయి. ఇదిలా ఉంటే సినిమా థియేటర్లలోకి రాకముందే అప్పుడే ఓటీటీ రిలీజ్‌కు సంబంధించిన ఆసక్తికర వార్తను షేర్ చేశారు మేకర్స్. లెనిన్ పోస్ట్ థియాట్రికల్ రైట్స్‌ను పాపులర్ టెలివిజన్ నెట్‌వర్క్ జీ దక్కించుకుంది. జీ నెట్‌వర్క్ లెనిన్ మూవీ డిజిటల్, శాటిలైట్ రైట్స్‌ను దక్కించుకుంది. థియాట్రికల్ రన్ తర్వాత జీ5లో ప్రీమియర్ కానుంది. అంతేకాదు జీ తెలుగు, జీ సినిమాలులో టెలివిజన్ ప్రీమియర్ కానుంది. ఆయా ఎ÷–లాట్‌ఫాంలలో విడుదల తేదీలపై మేకర్స్ థియాట్రికల్ రిలీజ్ తర్వాత క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్‌తోపాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ చిత్రంలో శివాజీ, సునీల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన లెనిన్ టైటిల్ గ్లింప్స్ మూవీ విలేజ్ బ్యాక్‌డ్రాప్ నేపథ్యంలో సాగనున్నట్టు హింట్ ఇచ్చేసింది.



## తిలక్ వర్మ సరికొత్త ప్రపంచ రికార్డు

భారత క్రికెట్‌లో సరికొత్త శకం మొదలైంది. సీనియర్ల గైర్హాజరీలో యువ ఆటగాళ్లు మైదానంలో పరుగుల వరద పారిస్తూ సరికొత్త రికార్డులను తమ పేరిట లిఖించుకుంటున్నారు. ప్రస్తుతం ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టీ20 ఇంటర్నేషనల్ సిరీస్‌లో టీమిండియా యువ సంచలనం, వైస్ కెప్టెన్ తిలక్ వర్మ అద్భుత ప్రదర్శనతో అంతర్జాతీయ క్రికెట్ ప్రపంచాన్ని నివ్వెరపరిచాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో ఈ తెలుగు కుర్రాడు చెలరేగి ఆడి సరికొత్త మైలురాయిని అందుకున్నాడు. టీ20 ఇంటర్నేషనల్స్ చరిత్రలో అత్యంత తక్కువ వయస్సులోనే 1500 పరుగుల మార్కును దాటిన మొట్టమొదటి భారతీయ బ్యాటర్‌గా తిలక్ వర్మ చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో అతడు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి దిగ్గజాలను సైతం వెనక్కి నెట్టడం విశేషం.క్రికెట్ మైదానంలో రికార్డులు సృష్టించడం, అవి బద్దలవడం సహజమే అయినా.. దేశానికి చెందిన ఇద్దరు యువ తారల మధ్య జరిగిన ఈ పరుగుల పోటీ అభిమానులకు అసలైన మజాను అందించింది. ఇంగ్లాండ్ పర్యటనలో జులై 1వ తేదీన జరిగిన మొదటి టీ20 మ్యాచ్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ తన తుఫాన్ బ్యాటింగ్‌తో అంతర్జాతీయ టీ20ల్లో 1500 పరుగులు పూర్తి చేసుకున్నాడు. ఆ సమయంలో భారతదేశం తరఫున అత్యంత పిన్న వయస్సులో ఈ ఘనత సాధించిన రికార్డు అభిషేక్ పేరిట నమోదైంది. అయితే, ఆ రికార్డు సంతోషం కనీసం రెండు రోజులు కూడా నిలవలేదు. జులై 3న జరిగిన రెండో మ్యాచ్‌లోనే తిలక్ వర్మ పరుగుల వేట సాగించి అభిషేక్ శర్మ రికార్డును బ్రేక్ చేసేశాడు. భారత్ తరఫున టీ20 ఇంటర్నేషనల్స్‌లో అత్యంత వేగంగా 1500 పరుగులు పూర్తి చేసిన టాప్ 5 ఆటగాళ్ల జాబితాను పరిశీలిస్తే యువ ఆటగాళ్ల ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ లిస్టులో తిలక్ వర్మ కేవలం 23 సంవత్సరాల 238 రోజుల వయస్సులోనే ఈ అరుదైన మైలురాయిని అందుకుని మొదటి స్థానంలో నిలిచాడు.



## రీఎంట్రీ ఇవ్వనున్న సంజూ శాంసన్!

టీ20 ప్రపంచకప్ గెలిచిన జోష్‌లో ఉన్న భారత్‌కు యూకే పర్యటన తీవ్ర నిరాశను మిగిల్చింది. వరుస ఓటములతో సతమతమవుతున్న వేళ, జట్టులోకి ప్రపంచకప్ హీరో సంజూ శాంసన్‌ను తిరిగి తీసుకోవాలనే డిమాండ్ ఊపందుకుంది.భారత జట్టు 2026 టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత ఆడిన నాలుగు మ్యాచ్‌లలో ఒక్కటంటే ఒక్కటి కూడా గెలవకపోవడం అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ చేతుల్లో టీమిండియా వరుసగా పరాజయాలు చవిచూసింది. ఈ క్రమంలోనే ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టీ20లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి చోటు కల్పించడం కోసం, ఏకంగా ప్రపంచకప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచిన సంజూ శాంసన్‌పై వేటు వేశారు. కేవలం మూడు ఇన్నింగ్స్‌లలో విఫలమయ్యాడనే కారణంతో భారత్‌కు మూడో ప్రపంచకప్ అందించిన స్టార్ ఆటగాడిని పక్కన పెట్టడంపై ఇప్పుడు సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్రస్తుత భారత తుది జట్టును పరిశీలిస్తే అగ్ర వరుసలోని ఏడుగురు బ్యాటర్లలో అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, అక్షర్ పటేల్, శివమ్ దూబే ఇలా ఏకంగా ఆరుగురు ఎడమచేతి వాటం ఆటగాళ్లే ఉన్నారు. ఒకే శైలి కలిగిన ఆటగాళ్లు వరుసగా ఉండటం వల్ల ప్రత్యర్థి బౌలర్లకు లైన్ అండ్ లెంగ్త్ మార్చాల్సిన అవసరం లేకుండా పోతోంది. ఇది బౌలర్ల పనిని మరింత సులువు చేస్తోంది. ఈ తరుణంలో కుడిచేతి వాటం కలిగిన సంజూ శాంసన్‌ను జట్టులోకి తీసుకుంటే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది.



# ఫుట్‌బాల్‌కు నేమార్ రిటైర్మెంట్

న్యూజెర్సీ వేదికగా జరిగిన ఫిఫా వరల్డ్ కప్ రౌండ్ ఆఫ్ 16 పోరులో నార్వే చేతిలో బ్రెజిల్ 2-1 తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఈ దారుణ ఓటమి తర్వాత బ్రెజిల్ స్టార్ ఫుట్‌బాల్ ఆటగాడు నేమార్ అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నాడు.

మ్యాచ్ ముగిసిన వెంటనే 34 ఏళ్ల నేమార్ భావోద్వేగానికి గురవుతూ.. తన 16 ఏళ్ల సుదీర్ఘ అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలుకుతున్నట్లు వెల్లడించాడు. 'సెలెకావో' (బ్రెజిల్ జట్టు)తో తన ప్రయాణం ముగిసిందని స్పష్టం చేశాడు. ఈ ఉత్కంఠభరిత మ్యాచ్‌లో నార్వే ఆటగాడు ఎర్లింగ్ హాలాండ్ చివరి నిమిషాల్లో వరుసగా రెండు గోల్స్ చేసి బ్రెజిల్‌కు గట్టి షాక్ ఇచ్చాడు. స్టాపేజ్ టైమ్‌లో నేమార్ పెనాల్టీని గోల్‌గా మలిచినప్పటికీ బ్రెజిల్‌కు ఓటమి తప్పలేదు.

మ్యాచ్ అనంతరం నేమార్ మాట్లాడుతూ.. "నేను ఎంతో ప్రయత్నించాను, కానీ ఇక అంతా ముగిసింది. నేను ఇక్కడే ప్రారంభించాను, ఇక్కడే ముగించాను" అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. గాయంతోనే వరల్డ్ కప్‌కు వచ్చిన నేమార్.. ఆరంభ మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఆ తర్వాత కోచ్ కార్లో అన్సెలొట్టి వ్యూహాల్లో భాగంగా స్కాలాండ్, నార్వే మ్యాచ్‌లలో సబ్‌స్టిట్యూట్‌గా మైదానంలోకి వచ్చాడు. బ్రెజిల్ జెర్సీలో పెనాల్టీ రూపంలో అతడు చేసిన చివరి గోల్ కేవలం ఓదార్పుగానే మిగిలిపోయింది. ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన బ్రెజిల్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. 2010లో సీనియర్ జట్టు తరఫున అరంగేట్రం చేసిన నేమార్.. బ్రెజిల్ చరిత్రలోనే అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచాడు.

మొత్తం 129 అంతర్జాతీయ మ్యాచ్‌లలో 80 గోల్స్ సాధించాడు. నాలుగు ఫిఫా వరల్డ్ కప్‌లలో బ్రెజిల్ ఫుట్‌బాల్‌కు ఫేస్ ఐకాన్‌గా నిలిచినప్పటికీ, ప్రపంచకప్ ట్రోఫీని మాత్రం అందుకోలేకపోయాడు. అయితే, 2013లో ఫిఫా కాన్ఫెడరేషన్స్ కప్, 2016 రియో ఒలింపిక్స్‌లో కెప్టెన్‌గా బ్రెజిల్‌కు బంగారు పతకం, 2012 లండన్ ఒలింపిక్స్‌లో రజతం అందించాడు. కెరీర్ అంతటా గాయాలు వేధించినా, అంచనాల భారం వెంటాడినా బ్రెజిల్ అత్యుత్తమ ఫుట్‌బాలర్లలో ఒకడిగా నేమార్ నిలిచిపోతాడు. మ్యాచ్ ముగిశాక మైదానంలో నేమార్ కన్నీళ్లు పెట్టుకోగా.. సహచర ఆటగాళ్లు అతడిని ఓదార్చారు. ఈ ఓటమితో కోచ్ కార్లో అన్సెలొట్టి ఆధ్వర్యంలోని బ్రెజిల్ వరల్డ్ కప్ ప్రస్థానం కూడా ముగిసింది.

# నార్వే చేతిలో బ్రెజిల్ ఘోర పరాజయం

న్యూయార్క్ న్యూజెర్సీలోని ప్రఖ్యాత మెట్‌లైఫ్ స్టేడియం ఒక చారిత్రక ఘట్టానికి, అదే సమయంలో ఫుట్‌బాల్ ప్రపంచంలోనే ఒక మహా విషాదానికి వేదికైంది. ప్రపంచ ఫుట్‌బాల్ చరిత్రలో ఐదుసార్లు వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచి, ఎదురులేని శక్తిగా ఎదిగిన బ్రెజిల్ జట్టు, 2026 ఫిఫా వరల్డ్ కప్ రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లో అనూహ్యంగా నార్వే చేతిలో 2-1 తేడాతో ఊహించని పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ ఘోర ఓటమితో బ్రెజిల్ ఆరవసారి ప్రపంచ కప్ గెలవాలన్న దశాబ్దాల కలలు శాశ్వతంగా చెదిరిపోయాయి. మ్యాచ్ ముగిసిన వెంటనే మైదానంలో ఆటగాళ్లు కుప్పకూలిపోయారు. గ్యాలరీలో తమ జట్టుకు మద్దతుగా నిలిచిన వేల మంది బ్రెజిల్ అభిమానులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మ్యాచ్ ప్రారంభం నుంచే రెండు జట్ల మధ్య తీవ్ర ఆధిపత్య పోరు కనిపించింది. బ్రెజిల్ ఆటగాళ్లు తమదైన చురుకైన శైలిలో దాడులు ప్రారంభించారు. ఆట 13వ నిమిషంలో నార్వే డిఫెండర్ క్రిస్టోఫర్ అజెర్.. బ్రెజిల్ స్ట్రైకర్ మాథ్యూస్ కున్హాను పెనాల్టీ బాక్స్‌లో ఫౌల్ చేయడంతో, వీడియో అసిస్టెంట్ రిఫరీ సమీక్ష తర్వాత బ్రెజిల్‌కు పెనాల్టీ లభించింది. అయితే బ్రూనో గిమారేస్ కొట్టిన ఆ కీలకమైన పెనాల్టీ కిక్‌ను నార్వే సీనియర్ గోల్ కీపర్ ఓర్జన్ నైలాండ్ ఎడమవైపునకు డైవ్ చేసి అత్యద్భుతంగా అడ్డుకున్నాడు. బ్రెజిల్ పదేపదే చేసిన దాడులను నైలాండ్ ఒక ఇనుప గోడలా అడ్డుకుంటూ తొలి అర్ధభాగం ముగిసేసరికి స్కోరు 0-0 వద్ద నిలిచేలా చేశాడు. వినీసియస్ జూనియర్, గాబ్రియేల్ మార్టినెల్లి, రేయాన్ వంటి ప్రపంచ స్థాయి స్ట్రైకర్లు చేసిన అనేక గోల్ ప్రయత్నాలు నైలాండ్ అమోఘమైన ప్రతిభ ముందు విఫలమయ్యాయి. రెండవ అర్ధభాగంలో బ్రెజిల్ సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన యువ కెరటం ఎండ్రిక్, మైదానంలో అడుగుపెట్టిన 52 సెకన్లకే వినీసియస్ జూనియర్ ఇచ్చిన పాస్‌తో ఒక సువర్ణ అవకాశాన్ని చేజార్చుకున్నాడు. ఆ తర్వాత నార్వే స్టార్ స్ట్రైకర్ ఎర్లింగ్ హాలండ్ బ్రెజిల్ రక్షణ వలయాన్ని ఛేదించడం మొదలుపెట్టాడు. 79వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్ ఆండ్రియాస్ స్చెలెడెరుప్ అందించిన అద్భుతమైన క్రాస్‌ను హాలండ్ అత్యంత వేగంగా అద్భుతమైన హెడర్ ద్వారా గోల్‌గా మలిచాడు. దీంతో నార్వే 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. బ్రెజిల్ ఆటగాళ్లలో అప్పటికే తీవ్రమైన ఒత్తిడి పెరిగిపోయింది. ఆ ఒత్తిడిని, బ్రెజిల్ డిఫెన్స్ లోపాలను క్యాష్ చేసుకున్న హాలెండ్, 90వ నిమిషంలో బ్రెజిల్ డిఫెండర్ డానిలో కాళ్ల మధ్యలోంచి బంతిని పంపి, గోల్ కీపర్ అలిసన్‌ను ఏమార్చుతూ మరో అద్భుతమైన గోల్ సాధించి స్కోరును 2-0 చేశాడు. ఈ రెండు గోల్స్‌తో హాలెండ్ ఈ వరల్డ్ కప్ టోర్నీలో కేవలం నాలుగు మ్యాచుల్లోనే తన గోల్స్ సంఖ్యను ఏడుకు పెంచుకున్నాడు. మ్యాచ్ నిర్ణీత సమయం ముగిసిన తర్వాత రిఫరీ ఇచ్చిన సుదీర్ఘ స్టాపేజ్ టైమ్‌లో బ్రెజిల్ స్టార్ ఆటగాడు నెయ్మార్ ఒక పెనాల్టీ ద్వారా గోల్ సాధించాడు. కానీ అప్పటికే జరగాల్సిన ఘోర నష్టం జరిగిపోయింది. అది కేవలం ఓదార్పు గోల్‌గా మాత్రమే మిగిలిపోయింది. రిఫరీ ఫైనల్ విజిల్ వేయగానే బ్రెజిల్ ఆటగాళ్లు మైదానంలోనే మోకాళ్లపై కూలబడి, పిచ్ పై పడుకుని ఏడ్చేశారు. నెయ్మార్, వినీసియస్ జూనియర్, అలిసన్ బెక్కర్ వంటి దిగ్గజ స్టార్లు తమ జెర్సీలతో ముఖాలు దాచుకుని వెక్కి వెక్కి కన్నీరు పెట్టుకున్నారు. స్టేడియంలో ఉన్న పసుపు-ఆకుపచ్చ రంగుల బ్రెజిల్ అభిమానులు తమ ఆరాధ్య జట్టు ఓటమిని ఏమాత్రం జీర్ణించుకోలేకపోయారు. ఎన్నో ఆశలతో వేల కిలోమీటర్లు ప్రయాణించి వచ్చిన వారు, తమ దేశపు కల ఇలా ముగిసిపోవడంతో కన్నీరు కార్చారు. 1990 తర్వాత బ్రెజిల్ ఇంత త్వరగా రౌండ్ ఆఫ్ 16 దశలోనే వరల్డ్ కప్ నుంచి నిష్క్రమించడం ఇదే తొలిసారి. మరోవైపు, తమ దేశ చరిత్రలో తొలిసారిగా వరల్డ్ కప్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్న నార్వే ఆటగాళ్లు, వారి అభిమానులు ఆనందంతో ఉప్పొంగిపోయారు. బ్రెజిల్ లాంటి అగ్రశ్రేణి జట్టును మట్టికరిపించిన నార్వే అద్భుత విజయం ఫుట్‌బాల్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.





# ఇదే నా చివరి ప్రపంచకప్..

## క్రిస్టియానో రొనాల్డో కీలక ప్రకటన

పోర్చుగల్ ఫుట్‌బాల్ సూపర్‌స్టార్ క్రిస్టియానో రొనాల్డో తన అంతర్జాతీయ కెరీర్‌పై ఒక కీలక ప్రకటన చేశాడు. ప్రస్తుతం జరుగుతున్న 2026 ఫిఫా ప్రపంచకప్ టోర్నమెంటే తన కెరీర్‌లో చివరిదని ఆయన స్పష్టం చేశాడు. స్పెయిన్‌తో జరగనున్న రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌కు ముందు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తన భవిష్యత్తు ప్రణాళికలపై వస్తున్న ఊహాగానాలకు తెరదించాడు. ఈ సందర్భంగా రొనాల్డో మాట్లాడుతూ.. "ఈ ప్రపంచకప్‌ను వీలైనంత ఎక్కువగా ఆస్వాదించాలనుకుంటున్నాను. ఎందుకంటే ఇదే నా చివరి ప్రపంచకప్. అయితే, రేపటి మ్యాచే ఈ టోర్నీలో నా చివరి గేమ్ కాకూడదని ఆశిస్తున్నాను" అన్నాడు. 41 ఏళ్ల రొనాల్డోకు ఇది ఆరో ప్రపంచకప్ కావడం విశేషం. ఈ టోర్నీలో ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లు ఆడి మూడు గోల్స్ సాధించాడు. వీటిలో ఒకటి నాకౌట్ దశలో చేసినదే. తన సుదీర్ఘ కెరీర్‌లో ప్రపంచకప్‌లలో మొత్తం 11 గోల్స్ నమోదు చేశాడు. రిటైర్మెంట్‌పై పదేపదే ప్రశ్నలు అడగవద్దని మీడియాను కోరాడు. "నేను ఎప్పుడు రిటైర్ అవ్వాలనుకుంటే అప్పుడే అవుతాను. మీరు కోరుకున్నప్పుడు కాదు. ఈ ప్రశ్న అడగడం సమయం వృథా. నా దృష్టి మొత్తం రేపటి మ్యాచ్‌పైనే ఉంది" అని స్పష్టం చేశాడు. జట్టు పట్ల తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, "జట్టుకు సహాయం చేయడానికి నేను ఎప్పుడూ నా శరీరం, ఆత్మతో కట్టుబడి ఉంటాను. నేను ఆడుతున్నానా? లేదా? అన్నది ముఖ్యం కాదు. నా పాత్ర ఎప్పుడూ కీలకమే" అని వివరించాడు. ఇది తన చివరి ప్రపంచకప్ అయినప్పటికీ, టోర్నీ గెలవాలనే లక్ష్యంతోనే పోర్చుగల్ జట్టు ఇక్కడికి వచ్చిందని రొనాల్డో ధీమా వ్యక్తం చేశాడు. "ప్రపంచకప్ గెలవగలమనే నమ్మకం లేకపోతే మేము ఇక్కడ ఉండేవాళ్లం కాదు. ఇది ఒక అందమైన అనుభవం. ప్రతీ గేమ్‌లోనూ మా ఆటను మెరుగుపరుచుకుంటున్నాం. ఇప్పటికే కొన్ని పెద్ద జట్లు టోర్నీ నుంచి నిష్క్రమించాయి. మా జట్టు చాలా ప్రశాంతంగా ఉంది, మేము బాగా శిక్షణ పొంది, మ్యాచ్‌కు సిద్ధమయ్యాం" అని అన్నాడు. మొత్తంగా ఈ ప్రపంచకప్‌తో తన ప్రస్థానానికి ముగింపు పలకనున్నప్పటికీ, జట్టును విజేతగా నిలపాలనే గట్టి పట్టుదలతో రొనాల్డో ఉన్నట్లు స్పష్టమవుతోంది.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# హోటళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

కుళ్లిన ఆహార పదార్థాలు, బొద్దింకలు, చెత్తా చెదారం నిండిన కిచెన్, కాలం చెల్లిన ఆహార పదార్థాలు, ఇలా ఒక్కటేమిటీ అన్నీ కంపే. ఇటీవలి కాలంలో తెలంగాణ రాజధ్యాని ఘనత వహించిన హైదరాబాద్‌లో వరుస దాడుల్లో మన హోటళ్ల బండారం బయటపడింది. ఆకలితో నకనకలాడుతున్న వారంతా ఆవురావురుమని తింటున్న ఆహారపదార్థాలు కుళ్లిన, కాలం చెల్లిన పదార్థాలతో తయారు చేస్తున్నారని అధికారులు బయట పెట్టారు. ఎంతో నమ్మకంతో హోటల్‌కు వెళ్లిన వారికి ఇలాంటి తిండి పెడుతూ కోట్లు వెనకేసుకుంటున్న హోటళ్లను మూసేయాల్సిందే. వారిని వెనక ఉండి నడిపిస్తున్న రాజకీయ నాయకుల భరతం పట్టాల్సిందే.ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిని అస్సలు వదలకూడదు. ఎందుకంటే వీరి వండివారుస్తున్న తిండి వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. కొత్త కొత్త జబ్బులు కొని తెచ్చుకుంటున్నారు. ఇవన్నీ గుర్తించి ఇలాంటి హోటల్ వాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటే తప్ప హైదరాబాద్ పరువు కాపాడుకోలేం. ఇటీవల నగరరంలో వరుసగా ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేసి వందల కేసులు నమోదు చేశారు. ప్రఖ్యాత హోటళ్లలోనే కంపు కొట్టేలా కిచెన్‌లు ఉంటున్నాయి. కుళ్లిన మాంసాన్ని ఫ్రీజర్‌లో పెట్టి వండి మన ముఖాన పడేస్తున్నారు. ఇకపోతే మేక మాంసంలో ఎద్దుమాసం కలిపి అమ్ముతున్న వారు హోటళ్లకు కూడా దానిని సరఫరా చేస్తున్నారు. ఇవన్నీ చూస్తుంటే హైదరాబాద్ హోటళ్లు అంటేనే భయమేసేలా దారుణమైన పరిస్థితి తయారయ్యింది. కొంతకాలం పాటు ఎవకవరు కూడా హోటల్‌కు వెళ్లకుండా ఉంటే వారు దారికొచ్చేలా ఉన్నారు. ప్ర.ంలో హైదరాబాద్ అంటే ఎంతో పేరుంది. పర్యాటక రంగంలో ప్రపంచంలో మంచి స్థానం సంపాదించుకుంది. అంతర్జాతీయ పెట్టుబడులన్నీ హైదరాబాద్‌లోనే పెడుతున్నారు. ఐటి రంగంలో బాగా విస్తరించింది. అనేక అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడ ఉన్నాయి. దీంతో దేశవిదేశీయులు అనేకమంది ర ఓజూ హైదరాబాద్ సందర్శనకు వస్తుంటారు. ఇలాంటి ప్రతిభ ఉన్న భాగ్యనగరం కాస్తా మసకబారిపోతోంది. నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు ఇలా కుళ్లిన, కాలం చెల్లిన ఆహార పదార్థాలను వండిపెడితే వారి ఆరోగయం ఏం కాను. మనం తినే ఆహారం పరిస్థితి దారుణంగా ఉ ఒదన్న నిజాలు దాడులతో తెలిసింది. ఇటీవలి కాలంలో వరుసగా ఆహార భద్రతా అధికారులు జరిపిన మెరుపు దాడుల్లో వెలుగుచూసిన దృశ్యాలు చూ స్తుంటే, మనం తింటున్నది ఆహారమా లేక విషమా అనే భయం కలుగుతోంది. ఒకవైపు పర్యాటక భాగ స్వామ్యాల గురించి చర్చలు జరుపుకుంటూనే, మరోవైపు మన నగరంలోని కనీస పరిశుభ్రతను కూడా కాపాడుకోలేక పోతున్నాం. ప్రజలు కూడా తమ పరిసరాలు కాపాడుకోవడం లేదు. నగరాన్ని చెత్తతో నింపి నరకకూపంగా మార్చేస్తున్నారు. ఇది రకమైన అభివృద్ధి అన్నది ప్రజలు ఆలోచించాలి. ట్రాఫిక్ జామ్‌లు, వరదలొస్తే నాలాలు పొంగడం, రోడ్లు చెరువులను తలపించడం, ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు తలపించడం దారుణం కాక మరోటి కాదు. ఇలాంటి దుర్భర పరిస్థితులు మంచిదా అన్నది ప్రజలు కూడా ఆలోచన చేయాలి. ఇది ఖచ్చితంగా మన నగరాన్ని మనమే చేజేతులా నాశనం చేసుకుంటున్నామని గుర్తించాలి. హైదరాబాద్ నగరం గ్లోబల్ వేదికగా మారుతున్న వేళ ప్రజలుగా మనమంతా ఎలా ఉండాలో తెలుసుకోవాలి. అందమైన ఆకాశ హర్మ్యాలు ఉ ంటే సరిపోదు. ఇక్కడికి వచ్చే పర్యాటకులు హైదరాబాద్ అందాలను చూసి మురిసి పోవాల్సిందే. అలాగే పరిశుభ్రత కూడా ఇక్కడ ముఖ్యం. అలాగే ఇక్కడ దొరికే తిండి మంచిదనే భరోసా ఉండాలి. సామాన్యుడు కడుపు నిండా భోజనం చేసి, ఆరోగ్యంగా బయటకు వస్తాడనే భరోసా కల్పించడం పాలకుల ప్రాథమిక బాధ్యత.

కానీ, నేడు పరిస్థితి దానికి విరుద్ధంగా ఉంది. అధికారులు దాడులు చేసిన ప్రతిసారీ గడువు ముగిసిన నిల్వలు, కుళ్ళిన మాంసం, అపరిశుభ్రమైన వంటశాలలు, ఎలుకలు, బొద్దింకల స్వైరవిహారం దర్శనమిస్తున్నాయి. ఇదంతా ఒకేరోజులో పుట్టుకొచ్చిన సమస్యలు కావు. సంవత్సరాల తరబడి వ్యవస్థలో పెనవేసుకుపోయిన అవినీతికి, అధికారుల నిర్లక్ష్యానికి, యజమానుల కాసుల కక్కుర్తికి నిదర్శనం. అధికారులు తనిఖీలు చేసి, ఏదో నామమాత్రపు జరిమానాలు విధించి, హోటల్ యజమానిని వదిలేయడం వల్ల వస్తున్న ఉపద్రవంగా గుర్తించాలి. హోటళ్లలో అపరిశుభ్రత, కాలం చెల్లిన పదర్థాలను వాడితే కఠిన చర్యలు ఉ ండాలి. అవసరమైతే ఆ హోట్‌లను మూసేయాలి. జరిమానాలు విధించాఇ. హోటల్ నిర్వహణలో నిబంధనలు పాటించకపోతే, అది ప్రజారోగ్యంతో చెలగాటంగానే చూడాలి. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నేరంగా పరిగణించి, అందుకు తగ్గట్లుగా కఠిన చర్యలు తీసుకోవాలి. ఆయా హోటళ్ల యజమానులను రక్షించే రాజకీయ దగుల్బాజీలను పట్టుకోవాలి. దాడులు జరిగినప్పుడు కొన్ని రోజులు హడావుడి చేయడం, ఆ తర్వాత మళ్లీ మామూలే అనిపించడం వల్లనే ఈ వ్యాపారస్తుల్లో ఏమాత్రం భయం ఉండటం లేదు. నిజానికి, మన నగరం ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా ఎదగాలంటే, హోటల్ పరిశ్రమలో కఠినమైన 'ఫుడ్సేఫ్టీ ఆడిట్ విధానాన్నితీసుకు రావాలి. నిబంధనలు అతిక్రమించిన హోటల్ లైసెన్స్ ను శాశ్వతంగా రద్దు చేయాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటారన్న భయం కల్పించాలి. అప్పుడే మన హోటల్ వ్యవస్థ బా గుపడుతుంది. లేకుంటే ఇలాగే కుళ్లిన పదార్థాలతో ప్రజల ప్రాణాలతో చెలగటం తప్పదు.

## శైవానికి మూలాధారం - బౌద్ధమే !

'ఏసధమ్మో సనన్తనో అన్నది బుద్ధుని మాట! సనాతన -- అనే పదం బౌద్ధం నుండి వైదికులు దొంగిలించుకున్న పదం- పాకిత్ భాషలో బుద్ధుడి అసలు పేరు గోతమ, సిద్ధత్త- సంస్కృత భాషా ప్రభావంతో పాకీత్ భాష ప్రాకృతమైంది. గోతమ -- గౌతమ అయ్యింది. సిద్ధత్త సిద్ధార్థ అయ్యింది. ఈ ఆధునిక కాలంలో బతుకుతున్న మనకు పాకిత్ భాష తెలియదు. పరిచయం లేదు. ఇంతో అంతో సంస్కృత పదాలతో పరిచయం ఉంది గనుక, మనం గౌతముడనీ, సిద్ధార్థుడనీ అంటున్నాం. అప్పటి పాకిత్‌ను ప్రాకృతమనీ, పాలి భాషను పాళీ అని వ్యవహరిస్తున్నాం. ఇక్కడ ఉచ్చారణ కన్నా జరిగిన మోసాల గురించి తెలుసుకోవడం ముఖ్యం -- బుద్ధుడికి జ్ఞానోదయ మైందన్న దానికి గుర్తుగా బౌద్ధ శిల్పులు బుద్ధ విగ్రహానికి నుదుటి మీద నిలువుగా ఒక కన్నును చెక్కుకున్నారు. మామూలు కళ్లతో చూడ లేనిది ఆయన తన జ్ఞాన నేత్రంతో చూశాడని వారు అభిప్రాయ పడ్డారు.

దాన్ని కాపీ కొట్టి రుద్రుడి మూడో కన్ను (శివుడి మూడో కన్ను)గా వైదికులు కథలల్లారు. బౌద్ధుల జ్ఞాన ప్రతీక -- వైదికుల విస్ఫోటక ప్రతీక- అయ్యింది. ధ్యాన ముద్రలో ఉన్న కొన్ని శిల్పాలు కిరీటాలతో కనిపిస్తుంటాయి. వాటిని జాగ్రత్తగా గమనిస్తే, ఆ కిరీటాల మీద ధ్యాన ముద్రలో ఉన్న చిన్న చిన్న బుద్ధుడి రూపాలు కనిపిస్తాయి. అవి శివుడి విగ్రహాలే అయితే మరి అక్కడ బుద్ధుడి రూపాలేందుకున్నాయా ? అనే ప్రశ్న వస్తుంది. కట్టు కథలు గనక, ఎలాగైనా రాసుకోవచ్చునన్నది తేలిపోయింది. అశోక చక్రవర్తి పలు ప్రాంతాల్లో బౌద్ధ ధమ్మాన్ని ప్రచారం చేయడం కోసం అర్హతులైన (అర్హులైన) భిక్షులను, మహాస్థవిరులను నియమించాడు. అలాంటి వారిలో మహాదేవ్ మహాస్థవీర భిక్షవు ఒకరు. ఈయన పర్వత శ్రేణుల్లో నివసించేవాడు.

ఈయన్ను దృష్టిలో పెట్టుకుని, వైదిక మతస్థులు హరహర మహదేవ్‌ను- అంటే శివుణ్ణి సృష్టించుకున్నారు. బౌద్ధులు నాగజాతి వారు. బౌద్ధాన్ని రక్షించిన జాతి కూడా ఈ నాగ జాతి ప్రజలే. ఈ నాగులు బౌద్ధ ధమ్మ రక్షకులు, గొప్ప ప్రచారకులు అని చెప్పడానికి ప్రతీకగా బుద్ధుని చిత్రాన్ని కొన్నిచోట్ల సర్పంలా గీశారు (చెక్కారు) అంతేకాదు, బుద్ధుడికి రక్షణనిస్తున్నట్లు నాగుపాము పడగ నీడలో బుద్ధుడు, సమాధిలో కూర్చునట్లు.. శిల్పాలు చెక్కుకున్నారు. బౌద్ధ శిల్పాల్లో మనకు ఇలాంటివి చాలాచోట్ల కనిపిస్తున్నాయి. నాగుపాము మెడలో ధరించి, పర్వతాలలో సంచరించే మహా దేవుణ్ణి అంటే శివుణ్ణి -- బుద్ధుణ్ణి స్ఫూర్తిగా తీసుకుని వైదికులు రూపొందించుకున్నారు. బౌద్ధాన్ని కాపీ చేసి ఒక్కొక్కటి స్వంతం చేసుకున్నట్లుగానే, మహదేవుడు -- ఈశ్వరుడు -- శివుడు అని పిలవబడే హిందూ దేవుడికి మూలం బౌద్ధమే! పురాణాల్లో మహదేవుడు జటాధారిగా వర్ణించబడ్డాడు. అందుకు కారణం- సారనాథ్‌లో ఉన్న బుద్ధుడి విగ్రహం జటాధారిగా ఉంది. అంటే నిజమైన జటాధారి ఆ బుద్ధుడే అని తెలుస్తూ ఉంది కదా? శివుడిలాగా బుద్ధుడు కల్పిత పాత్ర కాదు.

ఇకపోతే బౌద్ధంలో అరహతులైన వారిని ఉన్నత స్థాయికి చేరుకున్న గొప్ప భిక్షువులను 'దేవా' అని సంభోదిస్తారు. ఇది పాలి భాషా పదం. అందుకే వారు బుద్ధుణ్ణి 'బుద్ధదేవా'- అని పిలుచుకున్నారు. బుద్ధుడు శాక్య గణానికి చెందిన భారతీయ మూలవాసి. విదేశీ ఆర్యుడు కాడు. చరిత్ర నుండి లభించిన ఈ వాస్తవాలు తెలుసుకున్న తర్వాత కూడా, వాటిని పక్కన పెట్టి, వైదిక మత పెద్దలు ఊహల్లో కల్పించుకున్న ఆ శివుడినే నమ్ముతాం -- అని ఎవరైనా అంటే, అది వారి ఇష్టం! ఆధారాలు లేని పురాణ పాత్రల మీద మాకు నమ్మకం ఉ ంది -- అని అనే వారితో మనకు వాదన లేదు. నిజాలు తెలుసుకోవాలి. నిజంలో బతకాలి అని తపించే వారి కోసమే ఈ సమాచారం -- కొంత మందైనా సరే, ఈ క్షణంలో ఆలోచించే సత్యాన్వేషకులు ఉంటారు కదా? పైగా భారత రాజ్యాంగం ప్రకారం వైజ్ఞానిక స్పృహను నిలుపు కోవడం అవుతుంది.

బోధిసత్వ అవలోకి తేశ్వరుణ్ణి -- శివుడిగా మార్చుకున్నారు. బోధిసత్యతారను-పార్వతిగా మార్చుకున్నారు.థేరగాథల్ని శ్రావ్యంగా పాడగలిగే బౌద్ధభిక్షుణి సురసతిని మార్చి, సర స్వతి -- చదువుల తల్లిగా చేసుకున్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న బౌద్ధ శిల్పాల రూపురేఖలు మార్చి, హిందూ దేవీ దేవతలుగా మార్చుకుని -- అర్చనలు, పూజలు పేరుతో పురోహిత వ ర్గం తమ జీవనాధారం చూసుకున్నారు. ధైర్యం ఉంటే- ఆ దేవీ దేవతల మేకప్‌లు, ఆభరణా లు, అతికించి పెట్టిన శరీర భాగాలు తొలగిం చి, ఉన్నవి ఉన్నట్లుగా దేశ ప్రజల ముందు పెట్టే సాహసం చేయగలరా? బ్రాహ్మణార్యులు బౌద్ధ గుహల్ని, చిహ్నాల్ని శిల్పాల్ని బౌద్ధ సాహిత్యాన్ని దొంగిలించి బ్రాహ్మణ మతానికి రూపకల్పన చేసుకున్నారు. అంతా కాపీ పేస్ట్ వ్యవహారమని అన్నింటికి అన్నీ ఆధారాలు అందుబాటులో కొచ్చాయి. చివరకు బుద్ధుణ్ణే తమ దశావతారాల్లో చేర్చుకున్న విషయం మనకు తెలిసిందే. వైదిక మతంలోని దశావతారాల్లో చేర్చుకున్నారు. గానీ, బుద్ధ విగ్రహాలు కనిపించిన చోట పూజలెందుకు చేయడం లేదు. పూజలు అక్కర లేదు.

# లౌకిక జీవితంలో క్షమాగుణంతో మానసిక ప్రశాంతత!

మనకు చెడు చేసిన వ్యక్తి మన ఆదీనంలోకి వచ్చినపుడు వారిపై హానికరమైన లేదా ప్రతీకార చర్యలకు పూనుకోకుండా వదిలేయడాన్ని 'క్షమాగుణం', 'మన్నించడం', లేదా 'క్షమ' అంటాం. క్షమాగుణం ఓ శక్తివంతమైన ఆయుధం. క్షమాగుణంతో సంతోషం, ఆరోగ్యం సిద్ధిస్తాయి. అందువల్లనే "క్షమయా సాధ్యతే సర్వమ్" అన్నారు పెద్దలు. తనయపైకి రాయి విసిరిన వ్యక్తికి తియ్యనైన ఫలాలను ఇచ్చే వృక్షం, భూమాత ఓర్పును క్షమాగుణానికి నిలువెత్తు నిదర్శనం. 'క్షమయా ధరిత్రి' అని వింటున్నాం. భూమాత క్షమాగుణానికి ప్రతీకగా నిలుస్తున్నది. పొరపాటు చేయడం మానవ సహజ గుణం. క్షమించడం దైవగుణం. మంచి పౌరులకు ఉండవలసిన గుణాల్లో క్షమాగుణం కూడా ప్రధానమైనది. క్షమాగుణం వల్ల క్రోధం నశిస్తుంది.



ప్రపంచ క్షమాగుణం దినోత్సవం:

మనిషికి శాంతి, మనసుకు ప్రశాంతత కావాలి. క్షమాగుణం వల్ల మానసిక ప్రశాంతత కలగడం, అనవసర ఒత్తిడి నుంచి బయట పడడం, అనవసర గొడవలు తగ్గి మానవ సంబంధాలు మెరుగుపడడం జరుగుతుంది. సమస్త జంతువుల్లో మనిషికి మాత్రమే క్షమాగుణం ఉంటుంది. క్షమాగుణం ప్రాధాన్యాన్ని గుర్తించిన ప్రపంచ పౌర సమాజం ప్రతి ఏట 07 జూలై రోజున "ప్రపంచ క్షమాగుణం దినం (గ్లోబల్ ఫర్గివ్‌నెస్ డే)" పాటించడం ఆనవాయితీగా వస్తున్నది. క్షమాగుణం ప్రాధాన్యాలను అవగాహన పర్చడం, దాని ప్రయోజనాలను వివరించడం లాంటి అంశాలను చర్చించడానికి ఈ దినోత్సవం ఉపకరిస్తుంది. క్షమించే వారిని చేతకాని వాడిగా చూస్తున్న సమాజం మనది, కాని అది ఒక అసమానమైన గొప్ప గుణం అని తెలుసుకోవాలి. క్షమాగుణం లేని వారిలో ఆందోళన, ఒత్తిడి, బిపీ, అసహజ భావోద్వేగాలు, ఆవేశాగ్ని, నిరాశలు పెరుగుతూ మానసిక ప్రశాంతత, జీవన సమతుల్యతలు తరుగుతాయి. 2026 ప్రపంచ క్షమాగుణం దినోత్సవం ఇతివృత్తంగా "క్షమాగుణం శక్తిని తెలుసుకుందాం (పవర్ ఆఫ్ ఫర్‌గివ్‌నెస్)" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది.

క్షమించడం ఓ స్వయం నియంత్రణ:

క్షమించడమనేది ఒక స్వయం నియంత్రణ. పశ్చాత్తాప బుద్ధి కలిగిన వాడికి క్షమాగుణం విలువ తెలుస్తుంది. నటించే వారికి క్షమాభిక్ష దుష్ఫలితాలను ఇస్తుంది. దోషికి తగిన శిక్ష విధిస్తేనే అది అతడిని నిర్దోషిగా మార్చుతుంది. ఓరిమికి పరాకాష్ఠ క్షమాగుణమే. ఇది ధీరుల, జ్ఞానవంతుల లక్షణం. ఎవరు కోపగించుకున్నా తాను నిబ్బరంగా ఉంటూ, కఠినమైన మాటలు పలికినా విననట్లు జవాబు ఇవ్వకుండా ఉ ండడం, అవమానం పొందినా మనసులో పెట్టుకోకుండా ఉండడం, ఆ వ్యక్తిని క్షమించడం లాంటి లక్షణాలు క్షమించే వారికి ఉంటాయి. క్షమాగుణంతో పాటు సహనశీలత ఉన్న వారు దైవ సమానులుగా భావించబడుతూ, మనిషిని మహాత్మున్ని చేస్తాయి. పగ వల్ల పగ పోదని గమనించాలి.

పగపై నీళ్లు చల్లే గుణమే క్షమాగుణం. క్షమాగుణం ఉన్న వారిలో పగ, కోపం లాంటివి ఉండవు. కోపంలోనూ, పగలోనూ చేసే పనులు విధ్వంసకరంగా, అత్యంత చెడు చేసేవిగా, మానవ సంబంధాలను తుంచేవిగా ఉంటాయి. అపకారికి ఉపకారం చేయడమే క్షమాగుణం అనబడుతుంది. క్షమాగుణం ఆచరణయోగ్యమే కాని అసాధ్యం కాదు. లౌకిక జీవితంలో సుఖశాంతులకు, ఆధ్యాత్మిక జీవితంలో ఉన్నతికి ఉపయోగపడేది క్షమాగుణమే. ఓర్పు, క్షమ, శాంతి అనే గుణాలు జీవితాన్ని అర్థవంతంగా చేస్తాయి. బలహీనుడు ఎన్నడూ క్షమించలేడు, క్షమాగుణం బలవంతుడి లక్షణం. క్షమాపణ మన హృదయాలను, ఆత్మను స్వేచ్ఛగా మార్చుతుంది.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.